పొగాకును
ప్రభుత్వ రంగ
సంస్థలు కొనాలి
- త్రోవగుంటలో వేలం కేంద్రాన్ని సందర్శించిన వి.శ్రీనివాసరావు
- ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 297 | విజయవాడ, శనివారం 31 మే 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 31 May 2025 | Rs



ముంబయి ముందుకు
- ఎలిమినేటర్‌లో ఓడిన గుజరాత్
- ఫైనల్ బెర్త్ కోసం 1న పంజాబ్‌తో ఢీ

6

జిడిపి తిరోగమనం..

- తయారీ రంగం వెలవెల
- గణాంకాలను వెల్లడించిన కేంద్రం

• నాలుగేళ్ల కనిష్టానికి పతనం • 2024-25లో 6.5 శాతమే

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతుందన్న బిజెపి సర్కార్ అర్భాట ప్రచారాలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోయింది. భారత వృద్ధిలో మరోమారు తిరోగమనం చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో జిడిపి ఏకంగా 6.5 శాతానికి క్షీణించి.. నాలుగేళ్ల కనిష్ట స్థాయికి దిగజారడమే ఇందుకు నిదర్శనం. కరోనా తర్వాత ఈ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. ఇంతక్రితం ఏడాది 2023-24లో నమోదైన 9.2 శాతం వృద్ధితో పోలిస్తే అమాంతం పడిపోయిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ రంగం రాణించగా.. తయారీ రంగం డిమాండ్ లేక మందగించింది. దీంతో మేక్ ఇన్ ఇండియా లక్ష్యం నీరుగారినట్లయ్యింది. కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) శుక్రవారం ప్రకటించిన నివేదిక ప్రకారం.. స్థిర ధరల వద్ద 2024-25లో వాస్తవ జిడిపి రూ.187.97 లక్షల కోట్లుగా నమోదైంది. ఇంతక్రితం 2023-24లోని రూ. 176.51 లక్షల కోట్లతో పోల్చితే 6.5 శాతం పెరిగింది. 2024-2025 మార్చితో ముగిసిన నాలు గో త్రైమాసికం (క్యూ4)లో జిడిపి 7.4 శాతం పెరిగి కొంత ఆశాజనకంగా కనబడిన ప్పటికీ.. గతేడాది ఇదే త్రైమాసికంలోని 8.4 శాతం వృద్ధితో పోల్చితే.. క్రితం క్యూ4లో జిడిపి మందగించింది.



వ్యవ'సాయం'..

జిడిపి ఆ మాత్రం పెరుగుదలలోనూ వ్యవసాయ రంగం ప్రధాన పాత్ర పోషించింది. 2023-24లో ఈ రంగం 2.7 శాతం పెరుగుదలను నమోదు చేయగా.. గడిచిన 2024-25లో 4.6 శాతం పెరిగింది. ఇదే సమయంలో గనుల రంగం 2.7 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం ఏడాది గనుల రంగం 3.2 శాతం పెరిగింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 8.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2023-24లో 8.8 శాతంగా ఉంది.

కొనుగోలు శక్తి క్షీణతను ప్రతిబింబించిన నిర్మాణ రంగం

ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన తయారీ రంగం నేలచూపులు చూసింది. 2023-24లో ఈ రంగం ఏకంగా 12.3 శాతం వృద్ధి చెందగా.. గడిచిన 2024-25లో భారీగా 4.5 శాతానికి క్షీణించింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలోని డిమాండ్, ప్రజల కొనుగోలు శక్తి పతనాన్ని ప్రతిబింబిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ రంగం, గ్యాస్, నీటి సరఫరా 5.9 శాతానికి పడిపోయింది. ఈ రంగం ఇంతక్రితం ఏడాది 8.6 శాతం పెరిగింది. నిర్మాణ రంగమూ మందగించింది. ఈ రంగం 2023-24లో 10.4 శాతం పెరగ్గా.. గడిచిన ఏడాదిలో 9.4 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో వాణిజ్యం, హోటళ్లు, రవాణ, కమ్యూనికేషన్స్ తదితర విభాగాల వృద్ధి 7.5 శాతంగా ఉండగా.. గడిచిన 2024-25లో 6.1 శాతానికి నెమ్మదించింది. ఫైనాన్షియల్, ప్రొఫెషనల్ సర్వీసెస్ సెక్టార్ 7.2 శాతానికి పరిమితమైంది. ఈ రంగం 2023-24లో 10.3 శాతం పెరిగింది. వృద్ధి రేటు పడిపోవడమంటే దేశంలో నిరుద్యోగం పెరుగుదల, పెట్టుబడుల్లో స్తబ్దత, ప్రజల ఆదాయాలు పడిపోవడానికి నిదర్శనమని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు గతేడాది 6.5 శాతం వృద్ధి రేటు కూడా కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు చెందిందే తప్ప.. సగటు కార్మికులు, ప్రజల బతుకుల్లో ఏ మాత్రం పురోగతి లేదనే వాదనలు ఉన్నాయి.

పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

సంపద సృష్టికర్తలు పారిశ్రామిక వేత్తలే!

సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు కొత్త భాష్యం

శ్రమజీవులే సకల సంపదల సృష్టి కర్తలన్న విషయం ఇప్పుడు కొత్తగా చెప్పనవసరం లేదు. కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుంటేనే పరిశ్రమలు సిరులను కురిపిస్తాయి. కష్టజీవులు ఆరుగాలం శ్రమిస్తేనే పంటలు పండుతాయి. శ్రమ రూపం మారొచ్చు. శారీరక శ్రమో, మేథో శ్రమో .. ఎక్కడో ఒక చోట, ఏదో ఒక రూపంలో ఉంటేనే సంపద సృష్టి సాధ్యమవుతుంది! ఇవేవి లేకుండా నోట్ల కట్టలు పిల్లలను పెట్టవు. విశ్వవ్యాప్తంగా నిరూపితమైన ఈ సత్యానికి భిన్నంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సిఐఐ సదస్సులో పారిశ్రామిక వేత్తలే సంపదను సృష్టిస్తారంటూ కొత్త భాష్యం చెప్పారు. సమాజానికి వారి అవసరమే ఎక్కువని అన్నారు. ఆ సదస్సులో చంద్రబాబు ఏం చెప్పారంటే...

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సంపద సృష్టి పారిశ్రామిక వేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తాజ్ పాలెస్‌లో జరిగిన సిఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2025లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి పారిశ్రామికవేత్తలే కావాలని అన్నారు. సంపద పెరిగితేనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్యమవుతుందని, పేదరిక నిర్మూలనకు కృషి చేయగలుగుతామని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామిక వేత్తలను సృష్టించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రజల నుండి ఆ మేరకు స్పందన రావాలని చెప్పారు. మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చాయని పేర్కొన్నారు. దావోస్‌లో ఏటా పారిశ్రామికవేత్తల సదస్సు జరుగుతుందని, అక్కడికి వెళ్లొద్దని కొందరు తనకు మిగతా 5లో

చెరువులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి- యదమరి (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీలోని కొత్త చెరువులో నీట మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఎస్ఐ ఈశ్వర్ యాదవ్ కథనం మేరకు... చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద పాల్యానికి చెందిన సిద్దు (11), తమిళనాడులోని పరదరామి తాలూకా సామిరెడ్డి పల్లెకు చెందిన అఖిలేష్ (13) వేసవి సెలవులు కావడంతో తమ అమ్మమ్మగారి ఊరైన కోయూరు గ్రామానికి వారం క్రితం వచ్చారు. స్నేహితులతో కలిసి గ్రామం పక్కనే ఉన్న కొత్తచెరువులో ఈత కొట్టడానికి వెళ్లి నీటిలో మునిగిపోయారు. వారిని గ్రామస్తులు బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు. సిద్దు ఆరో తరగతి, అఖిలేష్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రెండు రోజుల్లో తిరిగి ఊరికి వస్తామని చెప్పారని, ఇంతలోనే ఈ ఘటన చోటుచేసుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అఖిలేష్, సిద్దు మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉగ్రవాదాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం
- లౌకికతత్వాన్ని కాపాడుకుందాం
- పలుచోట్ల సమైక్యతా ర్యాలీలు

2

ఒకే షిఫ్ట్‌లో నీట్ పిజి పరీక్ష

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : నీట్ పిజి-2025 ప్రవేశ పరీక్షను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ప్రవేశ పరీక్షను జూన్ 15న రెండు విడతల్లో నిర్వహించి, జులై 15న ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ (ఎన్ఇబి) గతంలో ప్రకటించింది. పరీక్షను రెండు విడతల్లో నిర్వహించడం వల్ల ప్రశ్నల క్లిష్టతస్థాయి మారి కొందరు అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందంటూ సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఒకేవిడతలో నిర్వహించేలా బోర్డ్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు, సమయం సరిపోదంటూ ఎన్ఇబి చేసిన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. రెండు షిఫ్ట్‌లలో నిర్వహించడం ఏకపక్షతకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంది. ఏ రెండు ప్రశ్నాపత్రాలు ఒకేస్థాయిలో సులభంగా లేదా కఠినంగా ఉంటాయని ఎప్పుడూ చెప్పలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జూన్ 15న ఒకే షిఫ్ట్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. పూర్తి పారదర్శకత ఉండేలా చూసుకోవాలని పేర్కొంది. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసేందుకు తగిన సమయం ఉందని స్పష్టం చేసింది. ఒకేసారి పరీక్ష నిర్వహించడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని పలువురు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వికలాంగుల జాతీయ సంస్థల
స్వయం ప్రతిపత్తి దెబ్బతీసేందుకు కుట్రలు
- ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సమావేశంలో మురళీధరన్ 5

జులై 9న చారిత్రక సార్వత్రిక సమ్మె

- కార్మికులందరూ భాగస్వాములు కావాలి
- లేబర్ కోడ్‌లను ఐక్యంగా తిప్పికొడదాం
- తెలంగాణ సిఐటియు రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవంలో తపన్‌సేన్

ప్రసంగిస్తున్న తపన్‌సేన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు సవాల్ విసిరేలా జులై తొమ్మిదిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ కార్మికులకు పిలుపునిచ్చారు. చరిత్రలో అతిపెద్ద సమ్మెగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్మికుల హక్కులు, దేశ ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో సిఐటియు నూతన కార్యాలయాన్ని (ఎన్‌వి భాస్కరరావు స్మారక కేంద్రం) తపన్‌సేన్ ప్రారంభించారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ నేత పి.రాజారావు ఎర్ర జెండాను ఎగురవేశారు. రాష్ట్ర కార్యాలయం మొదటి అంతస్తును సిఐటియు ఉమ్మడి ఏపి పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు, రెండో అంతస్తును సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె.హేమలత, మీటింగ్ హాలును అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, గెస్ట్ రూములను అఖిల భారత ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య, సోషల్ మీడియా స్టూడియోను సిఐటియు ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, లైబ్రరీని సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, డైనింగ్ హాలును సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, మినీ కన్వెన్షన్ హాలును సిఐటియు పూర్వ అధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్ ప్రారంభించారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన జరిగిన సభలో తపన్‌సేన్ మాట్లాడుతూ దేశంలో నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాక అన్ని మిగతా 5లో

'శ్రీశైలానికి' భారీగా ఇన్‌ఫ్లో

ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో కొనసాగుతున్న నీటి ప్రవాహం

శ్రీశైలం జలాశయం

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/శ్రీశైలం ప్రాజెక్ట్

వానాకాలానికి ముందే జలాశయాలకు నీటి ప్రవాహం వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి మేలోనే నీటి ప్రవాహం మొదలైంది. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జురాల ప్రాజెక్టుకు గురువారం నుంచి నీటి ప్రవాహం వస్తోంది. శుక్రవారం సాయంత్రానికి జూరాల నుంచి 70,650 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,758 క్యూసెక్కులతో కలిపి మొత్తం 79,408 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గతేడాది, 2023లో ఇదే సమయానికి ఎలాంటి వరద నీరూ రాలేదు. గతేడాది జులై 26న నీటి ప్రవాహం మొదలైంది. శ్రీశైలం జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 820.50 అడుగులు ఉంది. 2023లో ఇదే సమాయానికి 810 అడుగులు, గతేడాది ఇదే సమయానికి 806.20 అడుగులు ఉన్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది నీటిమట్టం పెరిగింది. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 41.1638 టిఎంసిలుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి 32.1516 టిఎంసిలు, 2023లో ఇదే సమయానికి 34.2920 టిఎంసిలు ఉన్నాయి. గతంతో పోలిస్తే నీటి నిల్వ కూడా పెరిగింది. ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే మూడు వారాల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

తుంగభద్రకు మొదలైన నీటి ప్రవాహం

ఎగువ నుంచి తుంగభద్ర జలాశయానికి నీటి ప్రవాహం మొదలైంది. ఎగువ నుంచి 15,778 క్యూసెక్కుల వరద నీరు వచ్చి జలాశయంలోకి చేరుతోంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 1633 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 1,592.96 అడుగులు ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా, ప్రస్తుత 13.68 టిఎంసిలు ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో ఒక టిఎంసి నీరు వచ్చి చేరింది.

పిఎస్ఆర్ ఆంజనేయులుకు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

ముంబయి సినీనటి కాదంబరి జత్వానీ చేసిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పిఎస్‌లో నమోదైన కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్ ఆంజనేయులుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. 'రూ.20 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి 2వ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5లోపు సిఐడి దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలి. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదు. కోర్టులో పాస్‌పోర్టును సరెండర్ చేయాలి. ఇకపై నేరాలు తిరిగి చేయకూడదు. దర్యాప్తునకు సహకరించాలి. అధికారి కోరితే దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలి. సాక్షులను బెదిరించడం, ప్రలోభపెట్టడం చేయరాదు. కేసు గురించి పత్రికలు, టివిలతో మాట్లాడకూడదు' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు చెప్పిన తీర్పు ప్రతి శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. ఈ కేసులో ఆంజనేయులు గత 36 రోజులుగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. దర్యాప్తు పురోగతి, ముగిసిన పోలీసు కస్టడీ నేపథ్యంలో బెయిల్ ఇస్తున్నట్లు ప్రకటించారు.

విశాఖలో సమావేశానికి హాజరైన నిర్మాతలు

27 మందితో కమిటీ

- విశాఖలో సినీ ప్రముఖుల సమావేశం
- టికెట్ల ధర, థియేటర్ల నిర్వహణ,పర్సంటేజీలపై చర్చ

ప్రజాశక్తి- సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని దొండపర్తిలోగల ఎపి ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో శుక్రవారం సినీ ప్రముఖుల కీలక సమావేశం జరిగింది. పలువురు నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు పాల్గొన్న ఈ సమావేశానికి ప్రముఖ నిర్మాతలు స్రవంతి రవికిషోర్, సి.కల్యాణ్, సుధాకర్ రెడ్డి, భరత్ భూషణ్ వంటి వారూ హాజరయ్యారు. సినీ పరిశ్రమలో తాజాగా చోటుచేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశం అనంతరం నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ టికెట్ల ధర, థియేటర్ల నిర్వహణ, పర్సంటేజీలపై చర్చించామని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల అసోసియేషన్లకు సంబంధించి ఒక్కో అసోసియేషన్ నుంచి తొమ్మిది మంది చొప్పున 27 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. వారి పేర్లను ప్రభుత్వానికి అందజేసి ఆదివారం మీడియాకు తెలియపరుస్తామని తెలిపారు. ఇప్పుడు థియేటర్లపై జరుగుతున్న తనిఖీలు నిరంతర ప్రక్రియలో భాగమేనన్నారు. ప్రతి నెలా తమ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరుగుతూ ఉంటుందని తెలిపారు.

దళితులపై దాడిచేసిన వారిపై చర్యలు

- డిజిపికి కెవిపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితులపై దొంగతనం మోపి కులం పేరుతో ధూషించి దాడులు చేసిన వారిపై సమగ్ర విచారణ చేసి కఠినంగా శిక్షించాలని డిజిపికి కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఫిర్యాదు కాపీని మీడియాకు విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, డొంకాడ ఎస్‌సి కాలనీలో లైటింగ్ వర్కు చేసుకునే నలుగురు యువకులను అదే మండలం కొత్తూరుకు చెందిన పెత్తందారు సెల్‌ఫోన్ పోయిందనే పేరుతో విచక్షణా రహితంగా కొట్టారని తెలిపారు. దీన్ని అడ్డుకునేందుకు వెళ్లిన మరో 14 మందినీ కొట్టారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేయగా నక్కపల్లి పోలీసులు సాధారణ కేసులు నమోదు చేసి దాడిచేసిన వారిని కాపాడే పనిచేస్తున్నారని ఆగ్రహించారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రూ.వెయ్యి కోట్లతో అడవితల్లి బాట

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అడవితల్లి బాట కార్యక్రమాన్ని రూ.వెయ్యి కోట్లతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం జన్‌మాన్ పథకంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో లక్కవరం నుంచి చీడిగొంద వరకూ రూ.87.19 లక్షల వ్యయంతో 1.01 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తి చేసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శుక్రవారం పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం వల్ల సమీప ప్రాంతాల్లోని గిరిజనుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. సమ్మిళిత వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్‌డిఎ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మారుమూల ఆవాసాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు.

పట్టణాభివృద్ధి శాఖలో నిధుల విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణాభివృద్ధిశాఖలో బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా నిధులు విడుదల చేస్తూ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు వివిధ విభాగాలకు కేటాయింపులు చేసినట్లు వాటిల్లో పేర్కొన్నారు. మొత్తం రూ.236 కోట్ల నిధుల విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపారు.

తెలుగు మీడియం తొలగింపు సరికాదు

- పిసిసి అధికార ప్రతినిధి కిరణ్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నూతన జాతీయ విద్యా విధానం.. మాతృ భాషలోనే ప్రాథమిక విద్యను బోధించాలని చెబుతుంటే కూటమి ప్రభుత్వం అందుకు వ్యతిరేకంగా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం పూర్తిగా లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తుందని ఎపిసిసి అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా వైఎస్‌ఆర్ కొన్ని వేల ప్రాథమిక పాఠశాలలను ప్రారంభిస్తే, కూటమి ప్రభుత్వం వేల సంఖ్యలో పాఠశాలలను మూసివేస్తోందన్నారు.

విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా విభజించారన్నారు. రాష్ట్రంలో మైనర్ మీడియంలైన ఉర్దూ, కన్నడ, తమిళ, ఒరియా మీడియంలను కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరహరిశెట్టి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ మొబైల్ వాహనాల రద్దుపై పిటిషన్

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) వ్యవస్థను రద్దు చేస్తూ ఈ నెల 23న వెలువడిన జిఓ 5ను కొట్టేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రాష్ట్రానికి నోటీసులిచ్చింది. పౌర సరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, పౌర సరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ చల్లా గుణరంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. వాహనాల ఆపరేటర్లు రోడ్డున పడతారంటూ రాజమహేంద్రవరానికి చెందిన తానేటి రామకృష్ణ, మంగళగిరి ధనంజయ కుమార్, గుట్టం రాజు సుచాన్ సింగ్, జి త్రినాథ్ అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. వాహనాల కొనుగోలు కోసం పిటిషనర్లు బ్యాంకుల నుంచి 90 శాతం వరకు రుణాలు తీసుకున్నారని పిటిషనర్ల తరపున న్యాయవాది వెంకటేష్ వాదించారు. ఆ 90 శాతం బ్యాంకు రుణంలో కూడా 30 శాతం రుణాన్ని లబ్ధిదారు 72 వాయిదాల్లో చెల్లించాలన్నారు. ప్రభుత్వం మారగానే విధానం మార్చేస్తే పిటిషనర్లు రోడ్డున పడతారన్నారు. 2027 వరకు బ్యాంకు రుణాలను చెల్లించాల్సి ఉందన్నారు. జిఓ 5పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ప్రభుత్వ వివరణ తర్వాతే తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు పేర్కొంది.

ఉగ్రవాదాన్ని ఐక్యంగా ఎదుర్కొందాం

- లౌకికతత్వాన్ని కాపాడుకుందాం
- పలుచోట్ల సమైక్యతా ర్యాలీలు

పల్నాడు జిల్లా క్రోసూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బాబూరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

దేశంలో మత సామరస్యాన్ని కాపాడాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పలు జిల్లాల్లో శుక్రవారం సమైక్యతా ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని కొత్త బస్టాండ్ నుంచి ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి అంతా ఏకం కావాలని కోరారు. నియోజకవర్గ కేంద్రం ఆచంటలో రామేశ్వరస్వామిసత్రం నుంచి కచేరి సెంటర్ వరకు, నరసాపురం పట్టణంలో అంబేద్కర్ సెంటర్ నుండి శివాలయం సెంటర్ వరకు సమైక్యత యాత్ర నిర్వహించారు. పల్నాడు జిల్లా క్రోసూరులో నిర్వహించిన సమైక్యతా ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందన్నారు. మతసామరస్యాన్ని దెబ్బతీసి దేశంలో చిచ్చు పెట్టాలనుకున్న ఉగ్రవాదుల కుట్రలను ప్రజలు తిప్పికొట్టారని తెలిపారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోయడం శోచనీయమన్నారు. నెల్లూరులోని విఆర్‌సి గ్రౌండ్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వరకు చేపట్టిన ర్యాలీలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. మతసామరస్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ర్యాలీని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడుల తర్వాత దేశంలో ప్రజలంతా ఐక్యతను ప్రదర్శించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచారని తెలిపారు. ఈ తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచాల్సిన ఎన్‌డిఎ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. బలిజిపేటలో ప్రజాసంఘాల కార్యాలయం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

టిడిపి జెండాలు తొలగించిన కేసులో 13 మందికి రిమాండ్

- పులివెందుల సబ్ జైలుకు తరలింపు
- కడప ఎంపి అవినాష్ పిఎ, మరొకరి కోసం పోలీసుల గాలింపు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మహానాడు సందర్భంగా పులివెందుల పట్టణంలో టిడిపి జెండాలు, తోరణాలు తొలగించడమే కాకుండా అడ్డువచ్చిన టిడిపి నాయకులపై దాడి చేసిన కేసులో 13 మంది వైసిపి నాయకులకు జమ్మలమడుగు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. టిడిపి నాయకుల ఫిర్యాదు మేరకు ఈ నెల 28 తేదీ అర్ధరాత్రి పోలీసులు 15 మంది వైసిపి శ్రేణులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వారిలో 13 మందిని అరెస్టు చేసి గురువారం అర్ధరాత్రి జమ్మలమడుగు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వారికి జమ్మలమడుగు మెజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో వైసిపి నాయకులు పులివెందుల మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, మల్లికార్జున, హల్ గంగాధర్‌రెడ్డి, ఓతూరు రసూల్, ఖాదర్‌బాషా, షేక్ మస్తాన్‌వల్లి, రాజేష్, కో-ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, పెనుకొండ తరుణ్, వేంకటపతి, చలపతిలను పులివెందుల సబ్ జైలుకు శుక్రవారం తెల్లవారుజామున తరలించారు. కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి, కృష్ణపాటి గంగిరెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నిర్బంధాలతో భయపెట్టలేరు

- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు పోరాటం
- అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు
- 11వ రోజుకు ఉక్కు సమ్మె

ప్రజాశక్తి - ఉక్కునగరం, కలెక్టరేట్ (విశాఖపట్నం)

అక్రమ తొలగింపులను నిరసిస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరింది. కార్మికులు విధులు బహిష్కరించి కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్మిక నేతలపై అక్రమంగా కేసులు బనాయించడాన్ని ఖండించారు. వారినుద్దేశించి విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. నిర్బంధాలతో, అక్రమ కేసులతో కార్మికులను భయపెట్టలేరని, తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మంత్రి రవి, ఉమ్మిడి అప్పారావు, పైడిరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిపిఎం, సిఐటియు

ఈ నెల 20 నుంచి జరుగుతున్న ఉక్కు సమ్మెలో పాల్గొన్నారన్న కక్షతో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం 1470 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కర్కశంగా బయోమెట్రిక్ తొలగించి గేటు బయట నిలిపివేసిందని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకునే చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకట్ రెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసింది. కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేయడానికి వస్తున్న కార్మికులకు పోలీసులు ఆటంకాలు కల్పిస్తున్నారని, తక్షణం వాటిని నిలిపివేసేలా చూడాలని కోరారు. విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు వారి ఉపాధి, హక్కుల రక్షణ కోసం, మనుగడను నిలుపుకునేందుకు గత్యంతరం లేని స్థితిలోనే నిరవధిక సమ్మెకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు. వారంతా మూడు దశాబ్దాలుగా స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్న వారేనన్నారు. వేల మందిని అర్ధాంతరంగా తొలగిస్తుంటే తమ కుటుంబ జీవితాలను కాపాడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వారు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని తెలిపారు.

ఐక్య పోరాటాలకు దిక్సూచి సిఐటియు

- ఆవిర్భావ దినోత్సవ సభలో వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐక్యత, పోరాటం నినాదంతో కార్మిక ఐక్య పోరాటాలకు సిఐటియు దిక్సూచిలా సమరశీల పోరాటాలు చేస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యాలయం వద్ద శుక్రవారం 'సిటు' 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. 'సిటు' రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సిటు ఏర్పడిన తర్వాత 21 సార్వత్రిక సమ్మెల్లో సంస్థ అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల్ని ఐక్యం చేయడం ద్వారానే వర్గ పోరాటాల్ని ఉధృతం చేయగలమన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిరంకుశంగా నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ జులై 9న అన్ని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాలకవర్గాలకు ఐక్య పోరాటాలతోనే ముకుతాడు వేయగలమన్నారు. ధనలక్ష్మి మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన నికరంగా నిలబడి సంపూర్ణ న్యాయం జరిగేలా ఏ విధమైన రాజీ లేకుండా పోరాడటానికి బిటి రణదివె, రామ్మూర్తి, జ్యోతిబసు వంటి ఉద్దండ నేతలు 55 ఏళ్లనాడు సిఐటియును ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో నండూరి ప్రసాదరావు, పర్స సత్యనారాయణ, కొండ్రగుంట వెంకటేశ్వర్లు, శ్రీహరి 'సిటు'కు బలమైన పునాదులు వేశారన్నారు. కార్మికుల పక్షాన నిజాయతీగా స్థిరంగా పోరాడుతున్న సంస్థగా ఐక్య పోరాటాలకు చొరవ చూపుతున్న సంస్థగా సిటుకు పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో సిటు రాష్ట్ర కార్యదర్శులు సుబ్బారావమ్మ, ముజఫర్ అహ్మద్, రాష్ట్ర కోశాధికారి కెఆర్‌కె మూర్తి, సత్యప్రసాద్, అరుణ, నరసింహులు, పి దుర్గ, శివనాగేంద్ర, జి దుర్గ, వీణ, జివి రంగారెడ్డి, సన్నీ పాల్గొన్నారు.

4న 'వెన్నుపోటు దినం' పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏడాది పాలనలో ఓటువేసిన ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, ఒక్క హామీనీ అమలు చేయలేదని వైసిపి కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎంగడుతూ జూన్ 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం దీనిపై పోస్టర్ విడుదల చేశారు. నియోజవకర్గాల్లో అన్నిస్థాయి అధికారులకూ వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిరసనలతో చంద్రబాబు కళ్లు తెరిపిస్తామని వివరించారు.

ప్రజలను మోసం చేసి తెచ్చుకున్న అధికారం : అంబటి

టిడిపి మహానాడులో కామెడీ చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రజలను మోసం చేసి తెచ్చుకున్న అధికారం ఎంతకాలం నిలబడుతుం దోననే అభద్రతాభావం మహానాడులో అడుగడుగునా వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

రాయలసీమకు ద్రోహం : శైలజానాథ్

రాయలసీమ ప్రజలంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపేనని, ఆయన చేసిన గాయాలకు ప్రజలు కన్నీరు పెడుతున్నారని వైసిపి నాయకులు సాకే శైలజానాథ్ అన్నారు. ఎయిమ్స్, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు అన్నీ అమరావతి లోనే ఏర్పాటు చేస్తున్నారని, రాయలసీమ ముద్దుబిడ్డలు ఇలా చేస్తారా? అని ప్రశ్నించారు.

ఆలయ భూముల హస్తగతం : విష్ణు

ఆలయ భూములను హస్తగతం చేసుకునేందుకు కూటమి సర్కార్ కుట్ర చేస్తోందని, కేబినెట్ ఆమోదం లేకుండా లీజులకు పచ్చజెండా ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. టెండర్ విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పిందన్నారు. దేవాదాయ భూములను తమ బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. జిఓ 139ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

స్వర్ణాంధ్రే యోగాంధ్ర లక్ష్యం : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య, ఆనంద, స్వర్ణాంధ్ర సాకారమే యోగాంధ్ర లక్ష్యమని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఇందుకు యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం అయ్యేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సచివాలయంలో జిల్లాల కలెక్టర్స్‌తో యోగాంధ్రపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 21న ప్రారంభించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 5,353 మందిని మాస్టర్ ట్రైనీలుగా తీర్చిదిద్దామన్నారు. దాదాపు 2 కోట్ల మంది ప్రజలకు యోగా శిక్షణ ఇచ్చేందుకు 1.25 లక్షల మంది శిక్షకులుగా తీర్చిదిద్దే కార్యక్రమం మందకొడిగా సాగుతుందన్నారు. జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలను ఈ నెలాఖరుకు పూర్తి చేసి, జూన్ 3 నుండి మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు. యోగా రిజిస్ట్రేషన్లలో కొన్ని జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, సంబంధిత జిల్లాల కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం నిర్ణీత కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్, జాతీయ యోగా దినోత్సవ వేడుకల రాష్ట్ర నోడల్ అధికారి ఎమ్‌టి కృష్ణబాబు, సాధారణ పరిపాలనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

అడవులను కార్పొరేట్లకు అప్పగించేందుకే.. : నారాయణ

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో : అడవులను ఖాళీ చేసి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం బిజెపి చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. మావోయిస్టులను చంపగలరు కానీ, సిద్ధాంతాలను చంపలేరని అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఎపి, తెలంగాణ భవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. మరోవైపు ప్రాంతీయ పార్టీల్లో ఇద్దరు పిల్లలుంటే ప్రమాదమే అని అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో పలుకుబడి అంతా కుటుంబం కోసమేనని అన్నారు. పదవులు, ఆస్తులు గొడవగా కవిత ఎపిసోడ్‌ను చూస్తున్నట్లు తెలిపారు. ఇక బిఆర్‌ఎస్‌లో ప్రజాస్వామ్యం లేదని, కాంగ్రెస్‌లో అతి ప్రజాస్వామ్యం పెద్ద సమస్య అని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌లో సిఎంలను పదే పదే ఢిల్లీకి పిలిపిస్తారని, దీని ప్రభావం పరిపాలనపై పడుతుందని అన్నారు.

రుణ ప్రణాళిక ఆధారంగా రుణాలు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వయం సహాయక సంఘాలకు డిజిటల్ వార్షిక రుణ ప్రణాళిక ఆధారంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనశాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. సంఘాలకున్న గుర్తింపు, అర్హతకు తగిన విధంగా రుణాలు అందజేయాలన్నారు. వార్షిక రుణ ప్రణాళిక, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరుపై విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో సిఇఒ వాకాటి కరుణ అధ్యక్షతన బ్యాంకర్లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల రుణ మొత్తం రూ.2 లక్షలు దాటినట్లయితే ముద్ర, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ తదితర పథకాల్లో వారికి అవసరమైన రుణాలు పొందేందుకు బ్యాంకు మేనేజర్లు సహకరించాలని కోరారు. వ్యాపారాల కోసం రుణాలు తీసుకున్న మహిళలకు 2 శాతం సబ్ ఇంటర్ వెన్షన్ వర్తిస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని మహిళలకు ఇచ్చే పెట్టుబడులను ప్రోత్సహించాలని తెలిపారు. మహిళలు వ్యాపారం కోసం రుణం తీసుకుంటే సిజిఎఫ్‌టిఎంఎస్‌ఇ పథకంలో గ్యారంటీ ఫీజు చెల్లిస్తే ఆ రుణ మొత్తం సెక్యూర్ చేయబడుతుందన్నారు. విశ్వాస్ పథకంలో ఎక్కువ మంది లబ్ధిపొందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ మాట్లాడుతూ.. మహిళలు పొదుపు చేసుకున్న రూ.20 వేల కోట్లలో సగం మొత్తం వారికి కావాల్సినప్పుడు అంతర్గత రుణాలుగా ఉపయోగించుకునే విధంగా బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ప్రతినెలా 10వ తేదీలోపు బ్యాంకులు మంజూరు చేసిన రుణాల వివరాలను సెర్ప్‌కు అందజేయాలన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ భాస్కరరావు, స్త్రీ నిధి బ్యాంకు ఎమ్‌డి ప్రసాదరావు, పలువురు బ్యాంకర్లు సమావేశంలో పాల్గొన్నారు.

గోదావరి-కావేరి లింక్‌పై 24న భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి-కావేరి అనుసంధానంపై జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడిఎ) టాస్క్‌ఫోర్స్ సమావేశం జూన్ 24న జరగనుంది. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగే ఈ భేటీకి సిడబ్ల్యుసి చైర్మన్ అధ్యక్షత వహిస్తారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ద్వారా కావేరికి అనుసంధానం ఎలా చేయాలనే అంశంపై చర్చించనున్నారు. ఇప్పటికే సిడబ్ల్యుసికి ఈ అనుసంధానంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖలు అభ్యంతరాలు పంపాయి. వాటిపై చర్చ చోటుచేసుకోనుంది. ఈ భేటీకి ఇరు రాష్ట్రాల అధికారులు హాజరుకానున్నారు.

పోలీసుల అదుపులో యుపిక్స్ యానిమేషన్ కిరణ్

- ఉత్తరాఖండ్‌లో అదుపులోకి తీసుకున్న ప్రకాశం జిల్లా పోలీసులు...

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పెద్ద వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని అత్యధిక లాభాలు ఆశచూపి రూ.కోట్లతో ఉడాయించిన యుపిక్స్ యానిమేషన్ అధినేత కిరణ్‌ను ప్రకాశం జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ కేంద్రంగా యానిమేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి రూ.కోట్ల నగదును వ్యాపారుల వద్ద నుండి వసూలు చేసిన ఆయన కొన్ని నెలల క్రితం పరారయ్యారు. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే ఏడాదికి రెట్టింపు అవుతుందని ఏజెంట్ల ద్వారా వ్యాపారులకు ఆశ కల్పించారు. దీంతో రాష్ట్రంలో వంద మందికిపైగా రూ.400 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టి మోసపోయారని సమాచారం. కిరణ్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు విజయవాడ సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించారు. మరి కొంతమంది బాధితులు ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఒక్కొక్కరుగా వచ్చి ఫిర్యాదులు చేస్తుండడంతో కిరణ్ నెల క్రితం వ్యాపారంలో దివాళా తీసినట్లు తెలంగాణ రాష్ట్రంలో ఐపి దాఖలు చేసి అందరికీ నోటీసులు పంపారు. పరారీలో ఉన్న కిరణ్ కోసం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తరాఖండ్‌లో ఆయన ఉన్నాడని తెలుసుకున్న ప్రకాశం జిల్లా పోలీసులు గురువారం తెల్లవారుజామున కిరణ్‌ను అదుపులోకి తీసుకొని ప్రకాశం జిల్లాకు తరలించారు. నరసరావుపేటకు చెందిన పలువురు బాధితులు ప్రకాశం జిల్లా ఎస్‌పిని కలిసి తాము మోసపోయిన విధానాన్ని ఆయన వద్ద మొరపెట్టుకున్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నేడు సిఎం పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పర్యటించనున్నారు. కాట్రేనికోట మండలం, చెయ్యేరులో పేదల సేవలో.. కార్యక్రమంలో పాల్గొనున్నట్లు సిఎంఒ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్మును నేరుగా అందిస్తారని తెలిపారు. అనంతరం ప్రజా వేదిక సభలో పాల్గొంటారన్నారు. జూన్ ఒకటి ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. జూన్ పింఛన్ల కోసం 63 లక్షల మందికి రూ.2,717.90 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,35,860 మంది లబ్ధిదారులు రూ.101.16 కోట్లు పంఛన్ల సొమ్ము అందుకోనున్నారని తెలిపారు. గతంలో ఒక నెల పింఛను తీసుకోకుంటే రెండో నెల ఇచ్చేవారు కాదని, కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల పింఛను ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. మే నెలలో 2 నెలల పింఛను కలిపి తీసుకున్న లబ్ధిదారులు 1,22,975 మంది ఉండగా, 3 నెలలు కలిపి తీసుకున్న వారు 9,176 మంది ఉన్నారని వెల్లడించారు.

వెలుగు ఆపరేటర్లకు హెచ్‌ఆర్ పాలసీ

- యూనియన్ రాష్ట్ర నాయకులు ధనలక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థలో మండలస్థాయిలో పనిచేస్తున్న అకౌంటెంట్స్ కంప్యూటర్ ఆపరేటర్లకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి డిమాండు చేశారు. ఎంఎస్ అకౌంటెంట్స్ ఈ కంప్యూటర్ ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర సదస్సు నాగలక్ష్మి, జరీనా ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పనిచేస్తున్న మండల సమాఖ్య అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు, హెచ్‌ఆర్‌పాలసీ, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉపాధికి ముప్పు వాటిల్లుతోందని, రాజకీయ జోక్యం పెరుగుతోందని, దీన్ని నివారించాలంటే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. వేతనాలు పెంచాలని కోరితే సెర్ప్ ఉద్యోగులు కాదని చెబుతున్నారని, ట్రాన్స్‌ఫర్లు మాత్రం చేస్తున్నారని, ఉద్యోగులు కానప్పుడు ట్రాన్స్‌ఫర్లు ఎలా చేస్తారని ప్రశ్నించారు. మండల సమాఖ్య నుండి ఆరువేల నుండి పదివేలు వేతనాలు చెల్లిస్తున్నారని 18 సంవత్సరాలుగా చేస్తున్నా వేతనాలు పెంచడం లేదని అన్నారు. వెంటనే వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు.

రాష్ట్ర అధ్యక్షులుగా జి. అరుణ

అనంతరం 15 మంది ఆఫీసు బేరర్లు, 55 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్షులుగా జి.అరుణ, ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, కోశాధికారిగా సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అక్షయ్, జరీనా, నాగలక్ష్మి, పద్మ, రామకృష్ణ, వెంకటలక్ష్మి, వి.వెంకట్, పుష్పలత, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు నిర్మూలనకే డిపోల్లో రేషన్ పంపిణీ : మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల నుంచి సరుకుల పంపిణీ చేయనుందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ ఒకటి నుంచి డీలర్లు రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర సరుకులు పంపిణీకి సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పని చేయాలని సూచించారు. రేషన్ దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, సరైన కొలతలతో సరుకులు పంపిణీ చేయాలని చెప్పారు. ధరలు, స్టాక్ బోర్డు, పోస్టర్లు ఏర్పాటుకు ఆదేశించారు.

ప్రతి దుకాణదారుడు విధిగా వారికి కేటాయించిన ఇ పోస్, వైట్ స్కేల్ మిషన్ పనితీరు పరిశీలించుకుని సిద్ధంగా ఉండాలన్నారు. వికలాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాల్లో సైతం సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఒకటి నుంచి 5వ తేదీలోపు వికలాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. వాట్సాప్ గ్రూపులో ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. సాంకేతిక సమస్యలు ఎదురైనా కార్డుదారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో సరుకుల పంపిణీ జరగాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు.

పి-4 లక్ష్యంగా పబ్లిక్-ప్రైవేటు సెల్ బలోపేతం

- ఆరుగురితో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పబ్లిక్-ప్రైవేటు-పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి-4)ను అమలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం ఆర్థికశాఖ పరిధిలో ఉన్న పిపిపి విభాగాన్ని పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనికోసం అధికారులు, కన్సల్టెంట్లను నియమించింది. ఈ మేరకు ఆర్థికశాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. పిపిపి నిపుణుడు షాలెంరాజు ఆధ్వర్యాన ఈ విభాగం పనిచేస్తుండగా, అందులో మరో ఐదుగురిని నియమించాలని నిర్ణయించారు. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న వారినే ఈ విభాగానికి నియమించడం గమనార్హం. ఆర్థికశాఖలో పనిచేస్తున్న సురేంద్రను సంయుక్త ఆర్థిక సలహాదారుగా, విభాగాధిపతిగా ఉన్న శ్రీనివాసులు, గణాంకాధికారి వివివి సత్యనారాయణ, మధ్యస్థాయి కన్సలెంట్‌గా ఉన్న శోభన్, మరో కన్సలెంట్ వంశీకృష్ణారెడ్డిని పిపిపి సెల్‌లో నియమించారు. వీరు ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆర్థికశాఖ విధులకు అదనంగా పిపిపి సెల్ బాధ్యతలు కూడా నిర్వహించాల్సి ఉంటుందని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ తెలిపారు. ప్రైవేటు-పబ్లిక్ భాగస్వామ్యం ద్వారా చేపడుతున్న పనులను వేగవంతం చేసేందుకు పిపిపి సెల్ పనిచేస్తోంది. సంబంధిత సంస్థలతో ప్రభుత్వం తరపున సమన్వయం చేసేందుకు ఈ సెల్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా పి-4ను ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించిన నేపథ్యంలో వాటి బాధ్యతను కూడా పిపిపి విభాగానికే అప్పగించనున్నారు. పి-4లో భాగంగా 15 శాతం వార్షిక వృద్ధిని సాధించేందుకు ఈ సెల్ ద్వారా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఆర్థికశాఖ పేర్కొంది. సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధికి తీసుకునే చర్యలను కూడా ఈ సెల్ ద్వారా పర్యవేక్షిస్తారు.

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- ఒకరు మృతి, ముగ్గురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

మృతి చెందిన చంద్రరావు (ఫైల్)

అప్పుల బాధతో ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మంగిన చంద్రరావు (40) వడ్డీ వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు భార్య కృష్ణజ్యోతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో కొంతమందికి వడ్డీకి చంద్రరావు డబ్బులు ఇవ్వగా వారు తిరిగి ఇవ్వలేదు. ఈ క్రమంలో బయట అప్పులు చేశారు. అప్పులు తీర్చడం సాధ్యం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని బంధువులకు ఫోన్ చేసి తెలిపారు. అనంతరం భార్య, ఇద్దరు పిల్లలు సహా చంద్రరావు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం చంద్రరావు మృతి చెందారు. ఆయన భార్య, పిల్లలు చికిత్స పొందుతున్నారు. డిఎస్‌పి చంద్రరావు తన సిబ్బందితో కలిసి జంగారెడ్డిగూడెంలోని చంద్రరావు ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెబ్‌సైట్లు, డాష్ బోర్డుల్లో సమాచారం అనుసంధానం

- లంకా దినకర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : స్వర్ణాంధ్ర సాధన కోసం రాష్ట్ర ప్రణాళికా విభాగం కృషి చేయాలని, వెబ్‌సైట్లు, డాష్ బోర్డుల్లో అవసరమైన సమాచారాన్ని అనుసంధానించేందుకు సంబంధించి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని 20 సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ సూచించారు.అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా, మండల స్థాయి స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రణాళిక విభాగం జాయింట్ సెక్రటరీ అనంత్ శంకర్ తెలిపారు. పి4కు సంబంధించి 20 శాతం అట్టడుగున పేదరికంతో ఉన్న 30 లక్షల గృహాలను సర్వేలో గుర్తించామని, ఇప్పటి వరకు 58 వేల బంగారు కుటుంబాలను, 53 వేల మార్గదర్శకాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యంగ్ ప్రొఫెషనల్‌ను పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమించనున్నట్లు ఎపిఎస్‌డిపిఎస్ ఇడి ఆలపర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

పొగాకు వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శ్రీనాథ్ కుటుంబానికి పరామర్శ

పొగాకును ప్రభుత్వ రంగ సంస్థలు కొనాలి

- త్రోవగుంటలో వేలం కేంద్రాన్ని సందర్శించిన వి.శ్రీనివాసరావు
- ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-పంగులూరు, ఒంగోలు బ్యూరో

మార్కెట్ సంక్షోభం నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వ రంగ సంస్థలతో పొగాకును కొనుగోళ్లు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా త్రోవగుంట సమీపంలోని పొగాకు వేలం కేంద్రాన్ని పార్టీ నేతలు, రైతుసంఘాల నేతలతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. వ్యాపారులు నిలువునా దోచుకుంటున్నారని, ధరల్లేవని శ్రీనివాసరావు రైతులు గగ్గోలు పెట్టారు. ఐటిసి, ఇతర వ్యాపారులు కూడబలుక్కొని సగటు ధర కిలో రూ.200కు పెరగకుండా చేస్తున్నారని వాపోయారు. గతేడాది ఉన్న ధరలు లేవని, ఎక్కువ బేళ్లను తిరస్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఐటిసి గుత్తాధిపత్యాన్ని దెబ్బతీస్తే 48 గంటల్లోనే ధరలు అమాంతం పెరుగుతాయన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును ఐటిసి, జిపిఐ వంటి సంస్థల ప్రోత్సాహంతోనే రైతులు సాగు చేశారని గుర్తు చేశారు. పంట చేతికివచ్చిన తర్వాత కొనుగోలు చేయడం లేదన్నారు. అటువంటి కంపెనీలకు బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రైతులను నిందించడం సరికాదని హితవు పలికారు. మంత్రి సమావేశం నిర్వహించిన పక్క ఊరిలోనే బర్లీ పొగాకు రైతు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వెళ్లి పరామర్శించలేదని విమర్శించారు. రైతు చనిపోతే మనస్సు రాలేదా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు, రైతు సంఘం నాయకులు పెంట్యాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

అప్పుల బాధ భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న నల్లబర్లీ పొగాకు కౌలు రైతు తల్లపనేని శ్రీనాథ్ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడారు. వ్యవసాయంలో వచ్చిన నష్టాలు, ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు.. అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనకవరం గ్రామంలో నల్లబర్లీ పొగాకు కౌలు రైతుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలో రైతు సంక్షోభానికి, వ్యవసాయ సంక్షోభానికి కారణం ప్రభుత్వ విధానాలేనని, వ్యవసాయాన్ని గాలిలో దీపంగా మార్చిందని విమర్శించారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాయిని వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో భద్రత బలోపేతంపై చర్చ

- డిజిపి, ఇఒ సమక్షంలో సమావేశం

ప్రజాశక్తి - తిరుమల

దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తిరుమలలో భద్రతను మరింత పటిష్టపరచి, సైబర్ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం తెల్లవారుజామున ఆయన దర్శించుకున్నారు. అనంతరం టిటిడి ఇఒ జె.శ్యామలరావు సమక్షంలో తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉన్నతస్థాయి భద్రత సమావేశం జరిగింది. భద్రతా అంశాలపై తిరుపతి ఎస్‌పి, టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒ హర్షవర్ధన్‌రాజు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం డిజిపి మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు. ఎపిఎస్‌పి, డిఎఆర్, ఎస్‌పిఎఫ్, హోంగార్డు, సివిల్ పోలీసు, టిటిడి సెక్యూరిటీతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలని సూచించారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలసి

తిరుమల భద్రతపై డిజిపి, టిటిడి ఇఒ శ్యామలరావు సమీక్షా సమావేశం

సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రత వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై ఆయన చర్చించారు. అనంతరం జె.శ్యామల రావు మాట్లాడుతూ.. భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిజి లా అండ్ ఆర్డర్ సుధాకర్ రెడ్డి, అడిషనల్ డిజి ఇంటలిజెన్స్ మహేష్ చంద్ర లడ్డా, అనంతపురం రేంజ్ డిఐజి డా.శేముషి, ఐఎస్‌డబ్ల్యుఎస్‌పి ఆరిఫ్ హఫీజ్, డిఎఫ్ఒ వివేక్ ఆనంద్, అలాగే వివిధ భద్రతా బలగాల అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు ఎంపిక పోటీలో విషాదం

- పరుగు పందెంలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి- పర్లాకిమిడి(ఒడిశా రాష్ట్రం)

హోంగార్డు ఉద్యోగాలకు నిర్వహించిన పరుగు పందెంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా పర్లాకిమిడిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్లాకిమిడి సమీపంలోని బెత్తగూడ పోలీసు మైదానంలో హోంగార్డు ఉద్యోగాలకు శరీర సౌష్టవం పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండు కిలోమీటర్ల పరుగుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ఉదయగిరి సమితి పొరిసోలా గ్రామానికి చెందిన జోలోంతో మిషాల్ (25) అస్వస్థతకు గురై మైదానంలోనే నేలకొరిగారు. మరికొద్ది సమయానికి మరో యువకుడు పడాల దీపక్ (21) స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే పోలీసులు అంబులెన్స్‌లో ఆయనను బరంపురం సమూహ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దీపక్ మృతి చెందారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కిసాన్ మోర్చా గజపతి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. హోంగార్డు ఎంపిక పోటీల్లో పది నిమిషాలకు రెండు కిలోమీటర్ల దూరం పరుగెత్తాలని పరిమితి పెట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు.

ప్రజల్లోకి 6 శాసనాల కాన్సెప్ట్

- ఎంపి, ఎమ్మెల్యేలతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుటుంబం'లోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపి, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రతినిధులకు సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కడప మహానాడు అద్భుతంగా జరిగిందని, జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా నేతలను అభినందించారు. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని, మహానాడుకు ప్రజలు, కార్యకర్తలు, స్వచ్ఛందంగా రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏడాదిలో ఏమి చేశామో రాబోయో రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించామన్నారు. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేలు విధిగా పేదల సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నట్లు సిఎం తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రైవేట్ సంస్థలతో పరీక్షలొద్దు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి రెసిడెన్షియల్ పాఠశాలల్లో వివిధ రకాల పేర్లతో విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే విధంగా ప్రైవేట్ వ్యక్తులు పరీక్షలు నిర్వహించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్‌రావు, కె ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ రకాల రెసిడెన్షియల్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 50 శాతం పాఠశాలలకు సొంత భవనాలు లేక ఇరుకైన గదుల్లో విద్యాభోదనతో పాటు అక్కడే నివాసం ఉన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాఠశాలల్లో వార్డెన్, కుక్, కమాటి, వాచ్‌మెన్, పిఇటితోపాటు అనారోగ్య సమస్యలు వస్తే కనీసం మందులు ఇచ్చే దిక్కు కూడా లేదన్నారు. బోధనేతర పనులు ఉపాధ్యాయులకు అప్పజెప్పడంతో బోధన కూడా సరైన మార్గంలో నడవడం లేదన్నారు. ఇంటిని విడిచి వచ్చిన పేద విద్యార్థులు జైల్లో ఖైదీల్లా ఉంటున్నారన్నారు. కొన్ని పాఠశాలల్లో కనీసం ఆట స్థలం కూడా లేదన్నారు. ఈ ఏడాది నుంచైనా రెసిడెన్షియల్ పాఠశాలల్లో బోధనా పద్ధతుల్ని మార్చాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలతోపాటు బోధనేతర సిబ్బందిని నియమించడం, బోధ నేతర పనులను ఉపాధ్యాయులకు చెప్పకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే సొంత భవనాలు నిర్మించాలని, ప్రైవేట్ వ్యక్తులకు పరీక్షలను నిర్వహించే అవకాశం ఇవ్వొద్దన్నారు. లేని పక్షంలో రెసిడెన్షియల్ విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణరాయుడుపేట గ్రామానికి చెందిన సిమ్మకృష్ణ (32) తమ గ్రామ సమీపంలోని చెరువు వద్ద పశువులు మేపుతుండగా ఒక్కసారిగా అతనికి సమీపంలో పిడుగుపడింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మరణించారు. డిగ్రీ చదువుతున్న కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నేపథ్యంలో పలు జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జోరు వర్షం కురిసింది. విజయనగరంలో సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి.గజపతినగరం, వేపాడ మండలంలో పంట పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. విశాఖలో శుక్రవారం సాయంత్రం గాజువాక, కూర్మన్నపాలెం సహా పలుచోట్ల జోరువాన కురిసింది.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

విద్యాదృక్పథాలు-ఉపాధ్యాయ వృత్తి : ప్రాధాన్యత

మండల వనరుల కేంద్రం (MRC)

గుణాత్మక విద్య నందించడానికి అవసరమైన కార్యక్రమాల గురించి బోధనా పద్ధతులు, బోధనాభ్యసన సామాగ్రిని రూపొందించడం లాంటి అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబడుతుంది. వర్క్‌షాపులు (కార్యగోష్ఠులు) నిర్వహించి విద్యార్థుల అభ్యసనానికి అనుగుణంగా పాఠ్యాంశాలను, సామర్థ్యాలను, కృత్యాలను, సామాగ్రిని తయారు చేసికోవడంలో తోడ్పడుతుంది. ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోడానికి వీలుగా వివిధ రకాల బోధనాభ్యసన సామాగ్రి, రిసోర్స్ పుస్తకాలు, పేటికలు (కిట్స్), కృత్య కోశాలు, ప్రశ్నల నిధులను కలిగివుండి వనరుల కేంద్రంగా పనిచేస్తుంది. సుమారు 1000 పుస్తకాలు కలిగిన గ్రంథాలయాన్ని కలిగివుండి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను, కృత్యాలను, ప్రశ్నలను, సామాగ్రిని రూపొందించుకోడానికి అనువుగా ఉంటుంది. బోధనాభ్యసన ప్రక్రియకు సంబంధించిన అంశాల ప్రదర్శన, వాటిపై చర్చ, అభిప్రాయాల మార్పిడికి అవకాశాన్ని కల్పిస్తుంది.

పాఠశాల సముదాయం

ఉపాధ్యాయులకు తరగతి బోధనలో ఎదురయ్యే సమస్యలను చర్చించి, పరిష్కరించడంలో తోడ్పడుతుంది. బోధనాభ్యసన సామాగ్రి తయారీలో, ప్రదర్శించడంలో, ఉపయోగించడంలో సహకరిస్తుంది. బహుళ స్థాయిలో, బహుళ తరగతిలో కృత్యాధార విధానంలో బోధించడానికి అనుగుణంగా పాఠాలను బోధించి, చర్చిండంలో తోడ్పాటు నందిస్తుంది. విద్యా వ్యవస్థలో వస్తున్న నూతన పోకడలను గురించి చర్చించి, అమలు చేయడానికి తోడ్పాటు నందిస్తుంది. పాఠశాలకు, బోధనాభ్యసన ప్రక్రియకు అవసరమైన వనరులను సమకూర్చుకొని దానిని విజయవంతం చేయడానికి తగిన చేయూతనిస్తుంది.

ఉపాధ్యాయ విద్యలో గుణాత్మకతను తీసుకురావడానికి ఈ విధంగా అనేక వ్యవస్థలు, సంస్థలు కృషిచేస్తున్నాయి. ఈ పైన వివరించిన బోధనా వృత్తి నీతి నియమావళిని పాటించడం ద్వారా అధ్యాపకుడు చాలామటుకు ఆదర్శ ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందుతాడు.

ఉపాధ్యాయుని ప్రేరణ (Teacher Motivation)

సాధారణంగా "ఒక క్రియ చేయడానికి లేదా కదలిక కలిగించడానికి పురికొలిపే అంతర్గత లేదా బహిర్గత శక్తిని ప్రేరణ" అని అంటారు. అయితే ఇక్కడ మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం "జీవిలోని అంతర్గతంగా కలిగే దానినే ప్రేరణ"గా వ్యవహరిస్తారు.

"ఉపాధ్యాయునికి బోధనలో అభిరుచిని ప్రేరేపించునదే ప్రేరణ."

ఉపాధ్యాయుని ప్రేరణ రకాలు

1. సహజ ప్రేరణ లేక అంతః ప్రేరణ (Natural or Intrinsic Motiva-tion) : ఒక వ్యక్తిలో నిబిడీకృతమై ఉన్న ప్రేరకాలు లేదా సహజాతాల ద్వారా జరిగే ప్రేరణను సహజ ప్రేరణ అంటారు. అంటే ఒక వ్యక్తి తనంత తానుగా ప్రేరేపించ బడటానికి కారణం ఒక పని చేయాలనే కోరిక అతనిలో కలుగుతుంది. అంతేకాక ఆ పని కేవలం అతని ప్రతిభకు, అతని అవసరానికి సంబంధించినదిగా ఉంటుంది. ఉదాహరణకు కవిత్వాన్ని చదవాలనే సహజ కోరిక ఉన్నప్పుడు దాన్ని చదవడంలో ఆనందాన్ని పొందుతాడు.

సహజ ప్రేరణలు మూడు రకాలుగా ఉంటాయి. అవి 1. ప్రాథమిక అవసరం లేదా కోరికల వలన కలిగే ప్రేరణలు. ఉదాహరణకు నవ్వు, ఏడుపు, ఆకలి, వాంఛ, జీర్ణక్రియ, రక్తప్రసరణ, చెమటపట్టడం లాంటివి.

2.సాంఘిక, శారీరక కారణాల వలన కలిగే ప్రేరణలు. ఉదాహరణకు నిరీక్షణ, అనుకరణ, అసహనం, ఉద్వేగ ప్రతిచర్యలు, కోర్కెల సంతృప్తి లాంటివి.

3. వ్యతిరేక కోర్కెలు లేక ప్రేరణలు. ఉదాహరణకు అలసట, ఒత్తిడి, బాధ, శూన్యత, నిరాశ, నిస్పృహ, వైరాగ్యం. స్వేచ్ఛా అపహరణ. సాధారణభయం, విషయాల ఎంపికలో నిర్బంధం లాంటివి.

2.కృత్రిమ ప్రేరణ లేక బహిఃప్రేరణ (Artificial or Extrinsic Motiva-tion) : ఒక వ్యక్తి అవసరాలకు గాని, అభిరుచులకు గాని సంబంధం లేకుండా ఒక పనిని చేయడానికి అతనికి లేదా చేసే ఏ పనైనా కేవలం తన అవసరాలకు, తన అభిరుచులకే పరిమితం కాక ఇతరుల మన్ననల కోసం లేక ఒకోసారి ఇతరుల అవసరాల కోసం కూడా చేస్తాడు. పొగడటం గౌరవించటం, బహుమతులనివ్వడం లాంటివి బాహ్య ప్రేరణలు. వీటివల్ల ఆ వ్యక్తి తన లక్ష్యాన్ని చేరగలుగుతాడు.

ఉపాధ్యాయుని ప్రేరణకు తోడ్పడే కారకాలు

1.జీతం : జీవితావసరాలకు తగిన జీతం లభిస్తే అది ప్రేరణగా ఉంటుంది. అంతేకాక ఇంక్రిమెంట్లు, డిఎ, హెచ్‌ఆర్‌ఎ సరిగా అందినప్పుడు ఇంకా బాగుంటుంది. పే రివిజన్‌లు కూడా అప్పటి సామాజిక, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఉండాలి.

2.ఉద్యోగ భద్రత : ఉద్యోగ భద్రత ఉన్నప్పుడు ఉపాధ్యాయులు తమ ప్రాధాన్యతను బోధనపై పెట్టగలుగుతారు.

3.వృత్తిలో పెరుగుదలకు అవకాశాలు : ఉపాధ్యాయులు క్షేత్ర దర్శనలు, పర్యటనల ద్వారా నూతన విషయాలను తెలుసుకొంటారు. బోధనాభ్యసన ప్రక్రియలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి యాక్షన్ రీసెర్చ్ లాంటివి జరుపుతుండాలి. సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాపులు, మీటింగ్‌లు, శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా వృత్తిలో పెరుగుదల ఉంటుంది.

4.వృత్తిలో తృప్తి : ఉపాధ్యాయునికి తను చేస్తున్న వృత్తితో సంపూర్ణంగా తృప్తి లభిస్తే అది ప్రేరణగా తోడ్పడుతుంది.

5.ప్రచురణలు : NCTE, NCERT, ఇతర సంస్థలు ప్రచురిస్తున్న పత్రికలు, పుస్తకాలు, పాంప్లెట్లు లాంటి వాటిని చదవటం ద్వారా వృత్తిలో ఎదుగుదల ఉంటుంది.

ఉపాధ్యాయుల, ఉపాధ్యాయ సంఘాల వృత్తి వికాసం (Professinol Devolopment of Teachers and Teacher Organisations)

ఉపాధ్యాయ వృత్తి వికాసం

(Professinol Devolopment of Teachers)

వృత్తి సామర్థ్యం అభివృద్ధిలో ఉపాధ్యాయునికి అందే వృత్తిపూర్వక శిక్షణ (Pre-service training), వృత్తంతర శిక్షణ (in-service training)లు ప్రధాన పాత్ర భూమికలను పోషిస్తాయి. జాతీయ విద్యావిధానం (1986) భావించినట్లు ఉపాధ్యాయ వృత్తి అభివృద్ధి వృత్తి పూర్వక శిక్షణ ద్వారా లభించే మార్పు, ఎగతెగని (కంటిన్యూటి) సంబంధం ఉపాధ్యాయుని వృత్తి సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి.

ఉపాధ్యాయుని వృత్తి అభివృద్ధి ఈ క్రింద పటం (OS.Dewal) లో లాగా నిరంతరంగా జరుగుతూ ఉంటుంది.



1. వృత్తిపూర్వక ఉపాధ్యాయ విద్య, శిక్షణ (Pre-service teacher education and training)లో విద్యా తత్త్వశాస్త్రం, విద్యా సామాజిక శాస్త్రం, విద్యా మనోవిజ్ఞానశాస్త్రం, మార్గదర్శకత్వం, మంత్రణం, పాఠ్యప్రణాళిక రూపకల్పన, అభివృద్ధి, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీ, బోధనాశాస్త్రం లాంటి ఉపాధ్యాయ విద్యతోపాటు టీచింగ్ ప్రాక్టీస్, ఇంటర్న్‌షిప్ లాంటి శిక్షణా కార్యక్రమాలుంటాయి.
2. వృత్యంతర ఉపాధ్యాయ విద్య, శిక్షణ (In-service teacher education and training)లో పాఠశాలలో శిక్షణ, (off-site course general), బోధనలకు సంబంధించి ఓరియంటేషన్ కోర్సులు, పాఠ్యాంశాలకి సంబంధించిన రిఫ్రెషర్, ఎన్‌రిచ్‌మెంట్ కోర్సులు, థీమ్ స్పెసిఫిక్ వర్క్ షాప్ ద్వారా వృత్యంతర విద్యా, శిక్షణ అందిస్తారు.
3. స్వీయ నిర్దేశిత నిరంతర విద్య (Self-directed con-tinuing education)లో స్వీయ అధ్యయనం, కలసి అధ్యయనం చేయడం, కార్యాత్మక (చర్యాత్మక) పరిశోధన, విస్తరణ ఉపన్యాల (extension lectures)కు వెళ్ళడం, విద్యాపరమైన వీడియోలను వీక్షించడం, విద్యాసంబంధమైన చర్చల్లో పాల్గొనడం లాంటి కార్యక్రమాల ద్వారా వత్యంతర విద్య మరియు శిక్షణ లభిస్తాయి.
4. వృత్తి అభివృద్ధికి సంస్థాగత అవకాశాలు (Institutional opportunities for professional growth)లో స్టడీ లీవ్,ఫెలోషిఫ్‌లు, జాబ్ రొటేషన్, అటాచ్‌మెంట్ల ద్వారా వృత్యంతర ఉపాధ్యాయ విద్య, శిక్షణ ఉపాధ్యాయుడికి లభిస్తాయి.

ప్రాక్టీస్ బిట్స్

1.చార్లెస్ ఉడ్ ఒక తాఖీదును భారతదేశానికి పంపిన సంవత్సరం
(1) 1954 (2) 1947 (3) 1854 (4) 1847

2. ఇంగ్లీష్ కావాలన్న వారికి ఇంగ్లీష్, ఇతరులకు మాతృభాషను బోధనా భాషగా ఉపయోగించాలని చెప్పినది.
(1) హంటర్ కమిషన్ (2) సార్జెంట్ కమిటీ
(3) కొఠారి కమిషన్ (4)

3.భారతదేశ చరిత్రలో మొట్టమొదటి విద్యా కమిషన్
(1) కొఠారి కమిషన్ (2) హంటర్ కమిటీ
(3) ఈశ్వర్‌భాయ్ పటేల్ కమిటీ (4) ఉడ్ డిస్పాచ్

4. సిఎబిఇ కమిటీ ఆన్ పాలసీ అధ్యక్షుడు
(1) యశ్‌పాల్ (2) రామమూర్తి
(3) జనార్ధన రెడ్డి (4) ఎవరూ కాదు

5. హర్టాగ్ కమిటీ తన నివేదికను ఏ సంవత్సరంలో సమర్పించింది.
(1) 1911 (2) 1917 (3) 1904 (4) 1929

6.బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశంలో విద్యా సమస్యలను అధ్యయనం చేయడానికి నియమించిన కమిటీ?
(1) హర్టాగ్ కమిటీ (2) గోఖలే కమిటీ
(3) కొఠారి కమిటీ (4) సార్జెంట్ కమిటీ

7. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత భారతదేశంలోని విద్యాభివృద్ధి కోసం బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన కమిటీ?
(1) ఏబట్ కమిటీ (2) ఉడ్ కమిటీ
(3) హంటర్ కమిటీ (4) సార్జెంట్ కమిటీ

8.సార్జంట్ కమిటీ తన నివేదికను ఏ సంవత్సరంలో సమర్పించింది.
(1) 1944 (2) 1945 (3) 1946 (4) 1947

9.3-6 సం॥ల పిల్లలకు ప్రీప్రైమరీ, నర్సరీ విద్య నందించడంతోపాటు ఇందుకుగాను స్త్రీ ఉపాధ్యాయులను నియమించాలని చెప్పిన కమిటీ
(1) హంటర్ కమిటీ (2) ఉడ్ కమిటీ
(3) సార్జెంట్ కమిటీ (4) ఏదీకాదు

10.మాధ్యమిక విద్యా కమిషన్- 1952-53కు అధ్యక్షత వహించినది.
(1) హంటర్ (2) కొఠారి (3) మొదలియార్ (4) సార్జంట్

11. 12 సంవత్సరాల పాఠశాల విద్యను సూచించిన కమిషన్
(1) మొదలియార్ (2) కొఠారి (3) ఉడ్ (4) ఫ్రాయిడ్

12.1964లో నియమించిన విద్యాకమిషన్ అధ్యక్షుడు
(1) మొదలియార్ (2) పటేల్
(3) హంటర్ (4) ఫ్రాయిడ్

13. ఏ సంవత్సరంలో కొఠారి కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించినది.
(1) 1964 (2) 1965
(3) 1966 (4) 1967

14. విద్యావిధానం 10+3+ 2గా ఉండాలని చెప్పిన విద్యా కమిషన్
(1) మొదలియార్ (2) కొఠారి (3)పటేల్ (4) ఏదీకాదు

15. కొఠారి కమిషన్ 1966లో ప్రభుత్వానికి సమర్పించిన రిపోర్టు పేరు
(1) Education and Human Development
(2) Education and Personality Development
(3) Education and Empowerment
(4) Education and National Development

16. 1986 జాతీయ విద్యా విధానం సవరించబడిన సంవత్సరం
(1) 1992 (2) 2002 (3) 2007 (4) 2012

17. భారతదేశంలో మొదటి ముస్లిం రాజైన మహమ్మద్ ఘోరి ఏ సం॥లో మక్తాబ్‌లను ప్రారంభించడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి జరిపాడు.
(1) 1102 (2) 1119 (3) 1192 (4) 1199

18.పది సంవత్సరాల కరిక్యులం రివ్యూ కమిటీ (1977)కి అధ్యక్షత వహించినది.
(1) కొఠారి (2) హంటర్
(3) మొదలియార్ (4) ఈశ్వర్ భాయ్ పటేల్

19.1975లో టెన్ ఇయర్ కరిక్యులం "ఏ ఫ్రేమ్‌వర్క్" అనే ప్రణాళికను రూపొందించినది.
(1) SCERT (2) NCTE (3) NCTE (4) NCERT

20. జాతీయ విద్యా విధానం ఏ సంవత్సరంలో రూపొందించబడింది.
(1) 1985 (2) 1986 (3) 1996 (4) 2005

రేపటి సంచికలో: ఉపాధ్యాయ సంఘాల ప్రాధాన్యత

జవాబులు :

(1) 3	(2) 4	(3) 2	(4) 3	(5) 4	(6) 1
(7) 4	(8) 1	(9) 3	(10) 3	(11) 1	(12) 4
(13) 3	(14) 2	(15) 4	(16) 1	(17) 3	(18) 4
(19) 4	(20) 2				

సంపాదకీయం

కీలకాంశాలేవీ..!

కడపలో మూడు రోజులపాటు అట్టహాసంగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు కొన్ని కీలకమైన అంశాలను విస్మరించడం గమనార్హం. పాలక కూటమికి నాయకత్వం వహిస్తున్న ప్రధాన పార్టీ ఈ రాష్ట్రానికి సంబంధించిన ముఖ్యాంశాల పట్ల మౌనం వహించడం తగదు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీల్లో ఇంకా నాలుగు అమలు చేయకుండానే ఆరు శాసనాలంటూ హడావుడి చేస్తున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంటు సాక్షిగా కేంద్రం ఇచ్చిన ప్రత్యేక హోదా, ఇతర హామీలు పదేళ్లు దాటినా అమలు కాకపోతే మహానాడులో ఆ ఊసే ఎత్తకపోవడం ఘోరమైన విషయం. తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో స్థాపించబడిన పార్టీ విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఆక్సిజన్ గా చెప్పబడే ప్రత్యేక హోదాను ఎలా విస్మరిస్తుంది? ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా రాష్ట్రాల హక్కుల కోసం నిలబడిన ఘన చరిత్ర టిడిపి వ్యవస్థాపక నేత ఎన్‌టి రామారావుది. ఆనాడు విపక్ష ముఖ్యమంత్రుల సమావేశాలు నిర్వహించి ఏకాభిప్రాయాన్ని కూడగట్టడంలో ఆయన అమోఘమైన కృషి చేశారు. గత పదేళ్లకు పైగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక్కొక్కటిగా రాష్ట్రాల హక్కులను హరిస్తోంది. గవర్నర్లను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పాలనను సైతం స్తంభింపజేస్తున్న తీరు చూస్తున్నాం. ప్రజలెన్నుకున్న శాసనసభలు ఆమోదించిన బిల్లులను ఏళ్లతరబడి పెండింగ్ పెడుతున్న గవర్నర్లకు ముకుతాడు వేసేలా దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఆ తీర్పును తప్పుబట్టే రీతిలో రాష్ట్రపతి ద్వారా ప్రశ్నలు సంధింపజేసిన కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై టిడిపి గళమెత్తకపోవడం ఎన్‌టిఆర్ వారసత్వం నుండి దూరం జరగడమే అవుతుంది. దేశంలో కుల మత ప్రాంతీయ విద్వేషాల్ని వ్యాప్తి చేస్తున్న పరివార్ శక్తులతో టిడిపి చెలిమి చేయడం, అధికారాన్ని పంచుకోవడంతో దాని లౌకికవాద ముద్ర మసకబారిపోతోంది. అందుకే ఆరు పేజీల సుదీర్ఘ రాజకీయ తీర్మానంలో లౌకికతత్వం కాపాడుతామన్న మాటే లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ స్థాపించిననాడు, ఎన్‌టిఆర్ పాలనలోనూ అనుసరించిన ఇటువంటి ముఖ్యాంశాల నుండి వైదొలగడం ఆ పార్టీకేగాక ఈ రాష్ట్రానికి కూడా నష్టదాయకం. చారిత్రకంగా లౌకికవాద భావనలు, మత సామరస్యం వెల్లివిరిసిన ఆంధ్రప్రదేశ్‌లో మతతత్వ శక్తులు పెచ్చరిల్లడానికిది తోడవుతోంది. రాష్ట్రంలో అధికారం పంచుకుంటున్న మరో ప్రాంతీయ పార్టీ అధినేత 'సనాతన ధర్మం' పేరిట చేస్తున్న విద్వేష ప్రచారంపట్ల కూడా టిడిపి మౌనంగా ఉండడం మత సామరస్యానికి హాని కలిగించడమేనని జనం భావించక తప్పదు. గత ఐదేళ్ల పాలనపై నిప్పులు చెరుగుతున్న టిడిపి అదానీ అవినీతిపై అమెరికా కోర్టుల్లో కేసులు వచ్చినా ఏ చర్యా చేపట్టకపోవడం, గత ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను, ఆస్తి పన్ను పెంపుదలనూ కొనసాగించడంతోపాటు ఆనాడు వ్యతిరేకించిన స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ఇప్పుడు ఏర్పాటు చేస్తామనడం ద్వారా ప్రజలకు హాని కలిగించే విధానాల విషయంలో ఇరు పార్టీలకూ తేడా లేదని నిరూపించారు. మహానాడు విజయవంతం కావడంలో యువ కార్యకర్తల కృషి కీలకమని అందరూ చెబుతున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా యువతను అభివృద్ధిలోకి తీసుకురావడం తన బాధ్యతని వక్కాణించారు. కానీ ఈ ఏడాది పాలనాకాలంలో కొత్తగా కల్పించిన ఉపాధి అవకాశాలేమీ లేవన్న వాస్తవాన్ని మరుగుపరిస్తే ఎలా? సిఎం చేసిన తొలి సంతకాల్లో ఒకటైన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ వచ్చినా అడవి బిడ్డలకిచ్చిన జిఓ 3 పునరుద్ధరణ ఆచరణలోకి రానందున ఉపాధి కోసం ఆదివాసీ యువత ఆందోళనబాట పట్టవలసి వచ్చింది. విదేశాలకు వెళ్లి చదువుకోవాలనుకున్న వారి ఆశలపైనా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీసా నిబంధనలతో నీళ్లు చల్లారు. ఇటువంటి సమస్యలను ప్రస్తావించకుండా, వాటిని పరిష్కరించకుండా యువత బాధ్యతనెలా తీసుకున్నట్టు? సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అన్న ఎన్‌టిఆర్ నినాదం వెనుక సంక్షేమమే ప్రధానం. ప్రజా సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలు, తామిచ్చిన ఎన్నికల హామీల అమలుకు పూనుకోవడం టిడిపి తక్షణ కర్తవ్యం. తెలుగుదేశం పార్టీ తన మూల విధానాలనుండి వైదొలగరాదన్నదే ప్రజాభిప్రాయం. అధినేతలు దాన్ని గౌరవిస్తారో లేదో!

మంచి మాట

జానపద సాహిత్యంలో నిరాశావాదానికి తావు లేదు. వారు ఎన్ని కష్టాల్లో ఉన్నప్పటికీ...వారి సమిష్టి జీవనమే...వారిలో దుష్టశక్తులపై విజయం సాధించి తీరుతామన్న చైతన్యం కల్పిస్తుంది.

- మగ్సిమ్ గోర్కీ,
ప్రసిద్ధ రష్యన్ రచయిత.

గాజా - మారణకాండ ప్రత్యక్ష ప్రసారం

వ్యాఖ్య

గాజాలో పిల్లలనే లక్ష్యంగా చేసుకుని దాడులు సాగించడం యాదృచ్ఛికమేమీ కాదు. అమాయకులైన చిన్న పిల్లలను కూడా హమాస్‌తో కుమ్మక్కయినట్టు ఆరోపించే పాపిష్టి పథకం అది. యూదు జాత్యహంకార రాజకీయవేత్తలు రగిలించిన ఉన్మాదంలో ఈ భావన లోతుగా పాతుకు పోయింది. "గాజాలో ప్రతి శిశువూ మన శత్రువే' అని నెతన్యాహూ ప్రభుత్వానికి బాగా సన్నిహితుడైన మోషే ఫైగ్లిన్ బల్ల గుద్ది మరీ ప్రకటించాడు. ఇలాంటి ప్రకటనల్లోని నీచత్వం గతంలో కనీ వినీ ఎరుగనిది. అలాంటి పిల్లలందరినీ నిర్మూలించడమే ఒక సైనిక లక్ష్యంగా ప్రకటించే వరకూ వెళ్లారు కొందరు తీవ్రవాదులు.

తన ఇంటి మీద ఇజ్రాయిల్ మిసైళ్లు జరిపిన దాడిలో పన్నెండేళ్ల యాకిన్ హమ్మద్ అనే పాప శరీరం ముక్కలు ముక్కలైపోయింది. యాకిన్ ను చాలా సముచితమైన రీతిలో గాజా అన్నే ఫ్రాంక్ అని పిలుస్తున్నారు. నాజీ ఆక్రమణ లోని ప్రాంతాలలో సాగిన మానవ హననాన్ని గురించి రోజూ వివరాలు రాసిపెట్టిన అన్నే ఫ్రాంక్ లాగానే యాకిన్ కూడా తన చుట్టూ సాగిన అమానుష కాండను రికార్డు చేసి పెట్టింది. ఈ కాలానికి తగినట్టు ఆమె డైరీలు డిజిటల్ రూపంలో వున్నాయి. తన ప్రజలపై సాగుతున్న రాక్షసాలకు అవి ప్రత్యక్ష చరిత్ర రూపంగా నమోదైవున్నాయి.

విచిత్రమేమంటే ఈనాటి ఇజ్రాయిలీ యూదు జాత్యహంకారులు తమ దేశం ఏర్పడటానికి తమపై సాగిన జాతి హత్యాకాండ వల్ల పడిన బాధలను హేతుబద్ధమైన కారణంగా చూపిస్తుంటారు. ఇప్పుడు వారు అవే క్రూర అణచివేత విధానాలకు పాల్పడుతున్నారు. యాకిన్ వరుసగా ఒక్కో శరణార్థి శిబిరం సందర్శిస్తూ వీడియోలు తీసింది. వాటిని ఇన్‌స్టాలో పోస్టు చేసింది. తద్వారా గాజాలోని దారుణ వాస్తవాలను ఒక మీడియా కార్యకర్త కన్నా బాగా ప్రపంచం దృష్టికి తీసుకురాగలిగింది. మానవతా సహాయంలో కూడా ఆమె భాగం పంచుకున్నది. యుద్ధంలో నాశనమైన గాజాలో వేలాది మంది పాలస్తీనియన్లకు సహాయం అందించింది.

శిశువులపై హత్యాకాండ

యాకిన్ వంటి సోషల్ మీడియా కార్యకర్తల కృషి ఫలితంగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ "ప్రత్యక్ష ప్రసారంలో జాతి హత్యాకాండ" అనే కొత్త మాటను బాగా వాడుకలోకి తెచ్చింది. గాజాలో పిల్లలనే లక్ష్యంగా చేసుకుని దాడులు సాగించడం యాదృచ్ఛికమేమీ కాదు. అమాయకులైన చిన్న పిల్లలను కూడా హమాస్‌తో కుమ్మక్కయినట్టు ఆరోపించే పాపిష్టి పథకం అది. యూదు జాత్యహంకార రాజకీయవేత్తలు రగిలించిన ఉన్మాదంలో ఈ భావన లోతుగా పాతుకుపోయింది. "గాజాలో ప్రతి శిశువూ మన శత్రువే' అని నెతన్యాహూ ప్రభుత్వానికి బాగా సన్నిహితుడైన మోషే ఫైగ్లిన్ బల్ల గుద్ది మరీ ప్రకటించాడు. ఇలాంటి ప్రకటనల్లోని నీచత్వం గతంలో కనీవినీ ఎరుగనిది. అలాంటి పిల్లలందరినీ నిర్మూలించడమే ఒక సైనిక లక్ష్యంగా ప్రకటించే వరకూ వెళ్లారు కొందరు తీవ్రవాదులు.

గాజాలోని 356 చదరపు కిలోమీటర్ల భూమిని స్వాధీనం చేసుకుని "ప్రక్షాళన" చేయడం కోసం సాయుధ సైన్యాలను మొహరించడమే ఇజ్రాయిల్ తాజా పథకం అని చెబుతున్నారు. ఇందులో 70 శాతం ఇప్పటికే పాలస్తీనియన్లు "రావడానికి లేని ప్రాంతం"గా మార్చబడింది. ఇప్పటికే గాజా జనాభా దాదాపుగా దక్షిణ చివరన ఉన్న రఫా నగరానికి తరలించబడింది. ఈ నగరం కూడా దాదాపుగా నాశనమైంది. ఇక ఖాన్ యోనిస్, డైర్-అల్-బలాహ్ వంటి నగరాలు నిత్య విధ్వంసానికి పర్యాయ పదాలుగా మారిపోయాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

దీర్ఘకాలిక ఆక్రమణకే

బహుశా ఈ విధ్వంసంలో అత్యంత ఆందోళనకరమైంది ఏమంటే పాలస్తీనియన్లను బలవంతంగా ఇజ్రాయిల్ నియంత్రిత ప్రాంతాలలోకి తరలించడమే. వీటికి "మానవతా ప్రాంతాలు" అని పేరు పెట్టడం మరీ విపరీతమైన విషయం. ఇజ్రాయిల్ ఆమోదంతో వచ్చిన ప్రైవేటు సహాయ సంస్థలు అక్కడ రేషన్ ప్యాకెట్టులు ఇస్తాయి. రాజకీయమయమై సైనికీకరించబడిన సహాయం కూడా వారిపై ఒత్తిడికి ఒక సాధనంగా ప్రయోగించబడుతున్నది. పాలస్తీనియన్లను అంతకంతకూ పరిమిత ప్రాంతాలకు పరిమితం చేసి అక్కడ అన్ని అత్యవసర అంశాలనూ ఇజ్రాయిల్ గుప్పిట్లో పెట్టడం ద్వారా సుదీర్ఘ కాలం పాటు ఆక్రమణ కొనసాగించడానికి ఈ పథకం వీలు కల్పిస్తుంది. ఈ సైనికీకృత సహాయ కార్యక్రమాన్ని అమలు చేసేందుకోసం ఐక్యరాజ్యసమితి పరిధి వెలుపలొక సహాయ సంస్థను నెలకొల్పడానికి డోనాల్డ్ ట్రంప్ వ్యక్తిగతంగా బాధ్యత తీసుకున్నట్టు చెబుతారు.

నెతన్యాహూ మంత్రివర్గం ఈ సైనిక కార్యక్రమానికి "విధ్వంస రథం" అని పేరు పెట్టింది. అయితే ఇది నిజంగా బందీలను విడుదల చేసేలా హమాస్‌పై ఒత్తిడి తేవడానికి ఉద్దేశించిందా లేక సామూహిక శిక్ష అమలు చేయడానికి తలపెట్టిందా అన్నది అక్కడ సాగే సామూహిక విధ్వంసం బట్టి ఎవరైనా చెప్పొచ్చు.

పశ్చిమ దేశాలలో మార్పు వున్నా...

ఏమైనా సైనిక చర్య తీవ్రత పశ్చిమ దేశాల స్వరం ఎంతో కొంత మారేలా చేసింది. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు ఒక సంయుక్త ప్రకటన చేస్తూ ఈ మానవీయ సంక్షోభం సహించరానిదన్నాయి. ఆహార సహాయ పథకం అరకొరగా వుందని విమర్శించాయి. "ఇజ్రాయిల్ సైనికాధికారులు వినియోగించిన జుగుప్సాకర భాషను మేము ఖండిస్తున్నాము. బలవంతంగా శాశ్వత తరలింపునకు గురి చేయడం అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది." అన్నాయి. హమాస్ అక్టోబరు 7 దాడి తర్వాత ఇజ్రాయిల్ ఆత్మరక్షణ హక్కును సమర్థించిన వారు ఇప్పుడు గాజాలో సైనిక కార్యకలాపాల విస్తరణను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు.

యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వన్ డర్ లియాన్ మానవతా సహాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయం చేయరాదన్నారు. రెండు దేశాల సిద్ధాంతం మాత్రమే ఆమోదయోగ్య పరిష్కారమన్నారు.

అయినా సరే అమెరికా నుంచి వ్యతిరేకత లేని నేపథ్యంలో మరీ ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ పెదవి కదపని పరిస్థితులలో నెతన్యాహూ ఈ సలహాలు పాటిస్తాడా అనేది అనుమానమే.

ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో ఐరాస మానవ హక్కుల ప్రత్యేక సంధానకర్తగా వున్న ఫ్రాన్సెస్కా అల్బెనీస్ ఈ విషయం మరింత సూటిగానే చెప్పారు: "అనేక సభ్య దేశాలు ఉదాసీనంగా వుంటున్నాయి. మరీ ఎక్కువనుకుంటే ఇజ్రాయిల్ నేరపూరిత చర్యలకు సహకరిస్తూ కుమ్మక్కు అవుతున్నాయి." ప్రత్యేకంగా పశ్చిమ దేశాలు, కొన్ని గల్ఫ్ దేశాల గురించి ఆమె ప్రస్తావించారు. ఇజ్రాయిల్ ఒక పీడక దేశంగా తయారయ్యే ప్రమాదం గురించి కూడా ఆమె హెచ్చరించారు. ఎందుకంటే అది పాలస్తీనియన్ల పైనేగాక ఐక్యరాజ్యసమితి మీద కూడా నిరంతరం దాడి చేస్తున్నది.

ఉదాసీనతే మూల కారణం

ఈ విషాద పరిస్థితికి కారణం ఉదాసీనతే. అది ఉద్దేశపూర్వకమైనది కావచ్చు, కాకపోవచ్చు. 1948లో ఇజ్రాయిల్ ఏర్పాటుకై ఐరాస చేసిన తీర్మానాన్ని ఆ విధంగా బలపర్చిన దేశాల ఉదాసీన వైఖరి నుంచే ఉత్పన్నమైంది. జాతి ప్రక్షాళన అనే యూదు జాత్యహంకార సైద్ధాంతిక భావజాలం మొదట్లోనే ప్రత్యక్షమైంది. యూదు చరిత్రకారుడు పాపే "పాలస్తీనాలో జాతి ప్రక్షాళన" అన్న తన పుస్తకంలో దీని వెనక ఉద్దేశాలను 1948 నక్బా నుంచి వివరంగా పొందుపర్చారు. ఆయన కుటుంబం కూడా ఈ మారణకాండలో నష్టపోయింది. ఇప్పుడు ఈ పథకం పూర్తిగా విప్పారుతోంది. గాజాను పర్యాటక తీరంగా మార్చాలనే డోనాల్డ్ ట్రంప్ విస్తార పథకం పుండు మీద కారం చల్లడం వంటిదే.

అక్టోబరు 7 తర్వాతనే ఇజ్రాయిల్ ఈ ఉన్మాద ప్రచారం ఎందుకు అమలు చేస్తున్నదనేది మనం అర్థం చేసుకోవాలి. హమాస్ సైనిక సామర్థ్యం ఎంత వున్నప్పటికీ వారు ఇజ్రాయిల్ భద్రత అభేద్యమైనదనే కట్టుకథను సవాలు చేశారు. పశ్చిమ దేశాలు మరీ ముఖ్యంగా అమెరికా బాగా చురుగ్గా సహకరించి వుండకపోతే ఈ ప్రచారం సాధ్యమై వుండేది కాదు.

ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య రెండు నాగరిక రాజ్యాల తరహాలో పరస్పర సంబంధాలు ఏర్పడకుండా కేవలం సైనిక బలం ఒక్కటే ఎన్నటికీ స్థిరశాంతి నెలకొల్పజాలదు.

హిందూత్వ శక్తుల వత్తాసు

మనం భారత దేశంలో చూస్తున్నది మాత్రం కనీవినీ ఎరుగనిది. చారిత్రికంగా భారతదేశ నాయకత్వం గాంధీ నుంచి నెహ్రూ వరకూ పాలస్తీనియన్ పోరాటానికి సుస్పష్టంగా మద్దతునిచ్చారు. ఒక జాతీయ ఏకాభిప్రాయం వుండేది. ఏమైనా హిందూత్వ శక్తుల పెరుగుదల దాన్ని పూర్తిగా మార్చేసింది. హిందూత్వకూ యూదు జాత్యహంకారానికి ఒకే ఉమ్మడి లక్షణాలుంటాయి. మతపరమైన అస్తిత్వ ఆధారిత జాతి భావన అసలు రాజ్యం స్వభావాన్నే రూపాంతరం చేస్తున్నది. వారు సైద్ధాంతిక భావాత్మక నేస్తాలు. ఆరెస్సెస్ తొలి రోజుల నుంచి దాని నాయకులు యూదు జాత్యహంకారాన్ని కీర్తిస్తూ వచ్చారు. ఇప్పుడు ఇస్లామోఫోబియా ఆజ్యం పోయడంతో..ఇప్పటి హిందూత్వ.. ఇజ్రాయిల్ విధ్వంసక చర్యలకు వత్తాసునిస్తున్నది.

ఘర్షణకు ఈ కూటమి కొత్త నిర్వచనమిస్తున్నది. దీన్ని పాలస్తీనా విమోచన పోరాటంగా గాక యూదులకూ ముస్లిం పాలస్తీనియన్లకూ మధ్య మత యుద్ధంలా చెబుతున్నది. మోడీ భారత్‌కూ నెతన్యాహూ ఇజ్రాయిల్‌కూ మధ్యన సైనిక భద్రతా భాగస్వామ్య సంబంధాలు పెరుగుతున్న కొద్దీ ఇది మరింత ఉధృతమవుతున్నది.

ఇక్కడ ఏం జరగాలన్నది స్పష్టం. పాలస్తీనా పట్ల అంతర్జాతీయ సంఘీభావం ఇనుమడిస్తున్నది. పశ్చిమ దేశాల స్పందనలో కూడా మార్పు సంకేతాలున్నాయి. 21వ శతాబ్దంలో గాజా అనేది ఆధునిక నాగరికతకు అస్తిత్వ పరీక్షగా మారుతున్నది. భారతీయులు ఇప్పుడు ఇజ్రాయిల్ ద్వేషపూరిత చర్యలను ఖండించేలా మోడీ సర్కారుపై ఒత్తిడి పెంచి సమీకరణ చేయవలసి వుంటుంది. ఈ బాధ్యత మనందరి పైనా వుంది.

(మే 28 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

దళితుల పట్ల కొనసాగుతున్న వివక్ష

విశ్లేషణ

అండ్ర మాల్యాద్రి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం దేశంలో అంటరానితనం నిషేధం. అంటరానితనాన్ని పాటించడం తీవ్ర స్థాయి నేరం. ఎవరు ఎక్కడ, ఎప్పుడు ఏ విధంగా అంటరానితనాన్ని పాటించినా కఠిన శిక్షకు అర్హులు. ఈ అంశాలను రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. వీటికి సంబంధించి అనేక చట్టాలు అమల్లో వున్నాయి. అయినప్పటికీ భారతీయ సమాజంలో అంటరానితనం అక్కడక్కడా అప్పుడప్పుడూ ఏదో ఒక రూపంలో బయటపడతూనే ఉంది. దేశంలో అత్యంత ప్రగతిశీలక రాష్ట్రాలుగా గుర్తింపు పొందిన చోట కూడా ఎస్సీలు, ఎస్టీలు, వెనుకబడిన తరగతులు, ఇతర దళిత వర్గాల పట్ల అంటరానితనంతో పాటు అనేక రకాలైన వివక్షలు కనిపిస్తూనే ఉన్నాయి. మన రాష్ట్రంలో ఆధిపత్య కులాలుగా ఉన్న బిసి లు కూడా దళితులపై కులవివక్ష చూపడం బాధాకరం. 2020 నుంచి ఇంత వరకూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో వివక్షకు సంబంధించిన ఘటనలు 900 పైగా చోటు చేసుకున్నట్టు జాతీయ నేర రికార్డులు తెలియజేస్తున్నాయి. ఇందులో అనేక కేసుల్లో కఠిన శిక్షలు విధించడం జరిగింది. దేశంలో అంటరానితనం పూర్తిగా పోలేదనడానికి ఇవి నిదర్శనాలు. అంటరానితనంతో సహా వివిధ రకాల వివక్షల వల్ల దళితులు స్వేచ్ఛగా సంచరించడానికి, అందరితో కలిసి మెలగడానికి అవరోధాలు ఏర్పడుతున్నాయి.

కాకినాడ జిల్లా పిఠాపురం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం. ఆయన సనాతన ధర్మం కోసం ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. మల్లంలో కనబడిన సామాజిక వివక్ష దాని పర్యవసానమే. కారణం మాకు జరిగిన అన్యాయంపై న్యాయం చెయ్యండి అని ఏకతాటిపై దళితులు నిలబడటమే. దేశంలో ఈ అంశంపై మరోసారి తీవ్ర స్థాయి చర్చకు దారితీసింది. ఇది మరవక ముందే అదే కోవలో విజయనగరం జిల్లాలోని ఓ గ్రామంలో దళితుల పట్ల చూపిన సామాజిక వివక్ష వెలుగులోకి వచ్చింది. జాతీయ రహదారి పక్కనే వున్న కె బిట్రగుంట గ్రామం సాక్షాత్తు మన రాష్ట్ర సాంఘీక శాఖామాత్యులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వారిది. ఈ గ్రామంలో కొందరు దళితులు బుద్ధుడి ఊరేగింపు చేస్తే ఆధిపత్య కులాలు వారు అడ్డుకున్నారు. మరోసారి డా॥బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఊరేగింపును అడ్డుకున్నారు. "మా వినాయకుడి ఊరేగింపు దర్శనానికి మీ పల్లెలకు రావడం లేదు. మరి మీ బొమ్మలతో మా బజారుకు ఎందుకు వస్తున్నార"ని అడ్డుకున్నారు. వాస్తవానికి ఈ ఘటనతో అంబేద్కర్ అందరివాడు కాదు, కొందరివాడని రుజువు చేశారు. దేశంలో అనేక ప్రాంతాల్లో ఇదే విధంగా జరుగుతోందని జాతీయ నేర రికార్డులు చెబుతున్నాయి. పైగా ఆలయాల్లో సైతం సాటి మానవుడి పట్ల వివక్షతో వ్యవహరించడం, మానవత్వాన్ని చూపకపోవడం విషాదకరం. అంబేద్కర్ 'అందరూ సమానులే' అని చెప్పాడు. అటువంటి అంబేద్కర్ విగ్రహాల పట్ల, ఊరేగింపుల పట్ల వివక్ష ప్రదర్శించడం అమానుషత్వంగానే భావించాలి. అనేక ప్రాంతాల్లో విగ్రహాలు ధ్వంసం చెయ్యడం, విగ్రహాలకు చెప్పుల దండలు వేసి అవమానించడం, చిత్రపటాలను చింపివేయటం లాంటి ఘటనలు, వివక్షలు ఇంకా కొనసాగుతున్నాయి. అందుకు సాక్షాత్తు మన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు తన నియోజకవర్గంలోని ఓ గ్రామంలో అందరూ చూస్తుండగానే అంబేద్కర్ ఫ్లెక్సీని చించి తన అధిపత్య ధోరణిని బయటపెట్టుకున్నారు. ఆలయాల్లోకి ప్రవేశించడానికే కాదు, అగ్రవర్ణాలు నడిచే రోడ్ల మీదా దళితులు నడవకూడదనే ఆంక్షలు కూడా కొన్ని చోట్ల అమలులో ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. అగ్రవర్ణాలు భోజన పలహారాలు చేసే చోట్లలో దళితులు తినకూడదనే ఆంక్షలు కర్ణాటక, తమిళనాడులో వున్నాయి. మన రాష్ట్రంలోని కర్నూలులో కూడా ఇటువంటి దురాచారాలు చోటు చేసుకోవడం మరింత దిగ్భ్రాంతి కలిగించే విషయం. దేశంలో అస్పృశ్యతను ఏడు దశాబ్దాల క్రితమే నిషేధించినప్పటికీ, ఇటువంటి దురాచారాలు, దాడులు, సామాజిక బహిష్కరణలు కొనసాగుతుండడానికి స్థానిక అధికారుల నుంచి ఆదరణ, ప్రోత్సాహం లభిస్తున్నాయి. ఇటీవల తెనాలి ఐతానగరంలో జరిగిన ఘటన అందుకు ఉదాహరణ. సాక్షాత్తు రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం ఇది. ఓ పోలీస్ కానిస్టేబుల్‌కి మామూలు ఇవ్వలేదనే గొడవలో పక్కనున్న ముగ్గురు కుర్రాళ్ళపై (అందులో ఓ యువ న్యాయవాది కూడా ఉన్నారు) కేసులు పెట్టి అరెస్ట్ చేసి నడిరోడ్డుపై కొట్టారు. థర్డ్ డిగ్రీ ప్రదర్శిస్తూ వారి అరికాళ్ళపై కొట్టి వీడియో తీసి దళితులకు ఓ హెచ్చరిక చేశారు. కోర్టుకు చూపించి రిమాండ్‌కి పంపారు. వారిపై రౌడీ షీట్ తెరిచారు. గంజాయి ముఠా అని, బ్లేడ్ బ్యాచ్ అని దుష్ప్రచారం చేశారు. నెల తరువాత ఆ వీడియోను బయటకు వదిలారు. గిరిజన, బలహీన వర్గాలకు చెందిన పోలీస్ అధికారులు సైతం ఇందులో భాగస్వాములయ్యారు. ఇది మానవ హక్కులను ఉల్లంఘించడమే. దళితులు కూడా తమ హక్కులు, అధికారాలను మరింతగా వినియోగించుకోవాల్సి ఉంది. చట్టాలు తమకు అనుకూలంగా ఉన్నాయని వారు అర్థం చేసుకోవాలి. మన రాష్ట్ర హోం శాఖామాత్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న నక్కపల్లిలో ఇంకో ఘటన జరిగింది. దీనికి సంబంధించి దళితులను వీపరీతంగా కొట్టడమే కాకుండా కౌంటర్ కేసులు పెట్టి వేధిస్తున్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో దళిత సర్పంచ్ పెట్టిన కేసు వెనక్కి తీసుకోకపోవడంతో చంపుతామని బెదిరిస్తున్నారు. అనంతపురం జిల్లా బ్రహ్మ సముద్రంలో ఆకలేసి మామిడి కాయలు కోస్తే... పట్టుకుని కొట్టడమే కాకుండా సాయంత్రం వరకు నిర్బంధించారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చోటుచేసుకుంటున్నాయి.

దళితులపై కుల దురహంకార దాడులు, సామాజిక బహిష్కరణలు, పోలీసు వేధింపులు పెరిగిపోతున్నాయి. ఈ ఘటనలు ఎక్కువగా అసెంబ్లీలో చట్టాలు చెయ్యాల్సిన, వాటిని అమలు చెయ్యాల్సిన ప్రజా ప్రతినిధులు, మంత్రుల నియోజక వర్గాలలోనే జరుగుతున్నాయి. వారు ముద్దాయిలను కాపాడే స్థితిలో ఉన్నారు తప్ప, బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేసే పరిస్థితిలో లేరు. బాధితుల రక్షణ కోసం ఉన్న చట్టాలను అమలు చెయ్యడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతి ఆరు నెలలకు ఒకసారి... మంత్రి, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకు అత్యాచార నిరోధక విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు జరపాలి. సమీక్షించి తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకునేలా, బాధితులకు న్యాయం జరిగేలా ఆదేశాలు ఇవ్వాలి.

దళితులపై కుల దురహంకార దాడులు, సామాజిక బహిష్కరణలు, పోలీసు వేధింపులు పెరిగిపోతున్నాయి. ఈ ఘటనలు ఎక్కువగా అసెంబ్లీలో చట్టాలు చెయ్యాల్సిన, వాటిని అమలు చెయ్యాల్సిన ప్రజా ప్రతినిధులు, మంత్రుల నియోజక వర్గాలలోనే జరుగుతున్నాయి. వారు ముద్దాయిలను కాపాడే స్థితిలో ఉన్నారు తప్ప, బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేసే పరిస్థితిలో లేరు. బాధితుల రక్షణ కోసం ఉన్న చట్టాలను అమలు చెయ్యడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రతి ఆరు నెలలకు ఒకసారి...మంత్రి, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకు అత్యాచార నిరోధక విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు జరపాలి. సమీక్షించి తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకునేలా, బాధితులకు న్యాయం జరిగేలా ఆదేశాలు ఇవ్వాలి. కానీ నేటికీ అలాంటివి జరగడం లేదు. చట్టాలను అమలు చేయడం, తగిన శిక్షలు వేయడం జరగాలి. వీటితో పాటుగా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించడం, దళితులకు చట్టాల పట్ల అవగాహన కలిగించడం అత్యవసరం. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, సామాజిక కేంద్రాలు, పంచాయతీల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాల్సిన అవసరం ఉంది. కులాలకు అతీతంగా సమానత్వాన్ని, సమ న్యాయాన్ని, మానవత్వాన్ని ప్రబోధించాల్సిన అవసరం కూడా ఉంది. రాజ్యాంగపరంగా దళితులకు ఉన్న హక్కులు, అధికారాల గురించి ఇతర వర్గాల్లోనూ, ముఖ్యంగా అగ్రవర్ణాల్లోనూ అవగాహన కలిగించాలి. సామాజిక సంస్కరణల ద్వారా మాత్రమే సాంఘిక దురాచారాలకు తెర పడుతుంది. ఇది మంచి ప్రభుత్వం లక్ష్యంగా ఉండాలని కోరుకుందాం.

కానీ నేటి పాలక పక్షాలు అలా లేవు. జరిగిన దుర్మార్గపు ఘటనలపై కేసులు పెట్టకుండా పోలీసుల ద్వారా రాజీలు చేసే పనిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం జరగాలి. చట్టాల అమలు కోసం, దళితుల రక్షణ కోసం ఐక్య పోరాటాలు జరగాలి.

/ వ్యాసకర్త కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 9490300366 /

శాంతి స్నేహ యోధుడు సుకుమారన్

నివాళి

విశాఖ అంటే సముద్రమూ, ఆంధ్రా యూనివర్సిటీ, యారాడకొండ మదిలో మెదిలినట్టే ఇక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా చటుక్కున గుర్తుకు వచ్చే పేరు సుకుమారన్. నలుగురు కలిసి ఏ సమావేశం జరుపుకున్నా అతన్నొకసారి తలవాల్సిందే. అంతలా అందరికీ స్నేహపాత్రుడైన సుకుమారన్ ఒక్కసారిగా 2025 మే 20న శాంతి, స్నేహ, సాంస్కృతిక ఉద్యమాలకు దూరమైపోయాడు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా సుకుమారన్ విశిష్ట సేవలు అందించారు. దేశవ్యాప్తంగా ఇస్కఫ్ లో పని చేస్తున్న ఎందరో నాయకులూ, కార్యకర్తలను పేర్లతోనే పలకరించేంత సాన్నిహిత్యం సుకుమారన్‌కు ఉండేది. ఇస్కఫ్ తో దాదాపు యాభై సంవత్సరాల అనుబంధం ఆయనది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోనూ, రాష్ట్రం విడిపోయిన తర్వాతి ఇస్కఫ్ కార్యకలాపాల్లోనూ, నిర్మాణంలోనూ ఆయన పాత్ర ఈ సంస్థతో అనుబంధం వున్న అందరికీ చిరపరిచితం. ఆయనతో కలిసి పని చేసిన జ్ఞాపకాలు, జరిపిన కార్యక్రమాలు గురుతులు ఇంకా మదిలో మెదులుతూనే వున్నాయి. దాదాపు 16 రాష్ట్రాల కళాకారులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి నాలుగు సార్లు అంతర్రాష్ట్ర సాంస్కృతిక ఉత్సవాలు విశాఖపట్నంలో ఒంటి చేత్తో నిర్వహించిన కార్యదక్షుడు సుకుమారన్. కేరళ నుంచి ఉద్యోగరీత్యా విశాఖపట్నం వచ్చి అందరితో కలిసిపోయి ఈ మట్టిలోనే కలిసిపోయిన సుకుమారన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘంలోనూ, భారత కమ్యూనిస్టు పార్టీ, విశాఖపట్నం లోను, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ గాను ఆయన సేవలు అందించారు. 2025, ఏప్రిల్ 26, 27 తేదీల్లో మదనపల్లిలో జరిగిన ఇస్కఫ్ ఇరవయ్యవ రాష్ట్ర మహాసభలో పాల్గొని సభల విజయవంతానికి కృషి చేసి మార్గదర్శకుడిగా నిలిచారు. ఇస్కఫ్ కు ఆయన అందించిన సేవలకు రాష్ట్ర మహాసభ ఆయనను సత్కరించి గౌరవించింది. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి వైదొలిగి అధ్యక్షవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

చీకూ, చింతా లేని టెలికాం ఉద్యోగంతో భద్ర జీవితం వుండి కూడా సమాజం కోసం, మంచి భవిష్యత్తు కోసం జరిగే అన్ని పోరాటాల్లోనూ సుకుమారన్ ముందు వుండేవారు. బయటకు కఠినంగా అనిపించినా విషయంలో మాత్రం స్పష్టత, నిజాయితీగల వాదన చేసేవారు. సుకుమారన్ భౌతికంగా దూరమైనా ఆయన ఇస్కఫ్ కార్యక్రమాల్లో పోరాటాల్లో సజీవంగానే వుంటారు.

- కాగితాల రాజశేఖర్,
'ఇస్కఫ్' ఏ.పి అధ్యక్షులు.

(మే 31న విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సుకుమారన్ సంస్మరణ సభ)

వికలాంగుల జాతీయ సంస్థల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసేందుకు కుట్రలు

- సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలి
- వికలాంగుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం దేశవ్యాప్త ఉద్యమం
- ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వికలాంగుల జాతీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేందుకు మోడీ సర్కార్ కుట్రలు పన్నుతుందని నేషనల్ ప్లాట్ ఫారం ఫర్ ది రైట్స్ ఆఫ్ ది డిసేబుల్డ్ (ఎన్‌పిఆర్‌డి) జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ విమర్శించారు. ఎన్‌పిఆర్‌డి కేంద్ర కమిటీ సమావేశం శుక్రవారం నాడిక్కడ హరికిషన్‌సింగ్ సుర్జీత్ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ నంబు రాజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ.. అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగుల, వికలాంగ విద్యార్థుల హక్కులపై దాడి చేస్తుందని అన్నారు. ఐక్యరాజ్య సమితి 2030 నాటికి వికలాంగులకు సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ సాధించడం లక్ష్యంగా పెట్టుకుందని, ఆచరణలో అమలుకు నిర్దిష్టమైన కార్యాచరణ లేదని పేర్కొన్నారు. కోవిడ్-19 పరిస్థితుల తరువాత ప్రపంచంలో వికలాంగుల సామాజిక, ఆర్థిక పరిస్థితి దిగజారిందని అన్నారు. విద్యాలోపాలు అత్యవసర సౌకర్యాలు వికలాంగులు పొందలేకపోతున్నారని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి నివేదిక వెల్లడించిందని అన్నారు. వికలాంగుల అభివృద్ధి కోసం ప్రత్యేక రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఐక్యరాజ్య సమితి ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2020-21 బడ్జెట్లో రూ.1,325 కోట్లు కేటాయిస్తే, 2025-26 బడ్జెట్లో రూ.1,275 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. ఆర్థిక సర్వేలో మానసిక వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నా.. బడ్జెట్లో కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ పెంచాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించలేదని విమర్శించారు.

వికలాంగుల కోసం ఉన్న జాతీయ సంస్థలను నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, జాతీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ ట్రస్ట్, నేషనల్ పాలసీలకు చీఫ్ కమిషనర్, 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టం వంటి వాటికి ఛైర్మన్లను నియమించడంలో కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. 2016 ఆర్‌పిడబ్ల్యుయు చట్టం నిబంధనలకు సవరణలు చేయాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, వికలాంగులందరికీ యుడిఐడి కార్డ్స్ జారీ చేయడంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. వికలాంగులపై వైకల్యం కారణంగా వివక్ష చూపకూడదని రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 పేర్కొన్నప్పటికీ అమలు కావడం లేదని అన్నారు. వికలాంగులకు సమాన అవకాశాలు దక్కడం లేదన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో వికలాంగులకు కేవలం 4 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. సంక్షేమ పథకాల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైకల్యం కారణంగా అనేక రాష్ట్రాల్లో ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు అన్యాయం జరుగుతోందన్నారు. వికలాంగుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు గిరీష్ కీర్తి, ఉపాధ్యక్షులు ఎం అడివయ్య, అనిర్భన్, ఝాన్సీ రాణి, సహాయ కార్యదర్శి రిషికేష్, కోశాధికారి చక్రవర్తి, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్, సాయమ్మ, జె రాజు, రంగప్ప, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం న్యాయమూర్తులుగా.. అంజారియా, బిష్ణోయ్, చందూర్కర్ ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయ మూర్తులుగా ఎన్‌వి అంజారియా, విజయ్ బిష్ణోయ్, ఎఎస్ చందూర్కర్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఈ ముగ్గురితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ హాజరయ్యారు. కొత్త న్యాయమూర్తుల రాకతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 34కు చేరుకుంది. జూన్ 9న జస్టిస్ బేలా ఎం.త్రివేది పదవీ విరమణ చేయనున్నారు. న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం చేసిన తరువాత సిజె గవాయ్ వారితో కరచాలనం చేసి స్వాగతించారు. జస్టిస్ బిష్ణోయ్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ ముగ్గురి పేర్లను ఈ నెల 26న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అంజారియా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ విజయ్ బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ చందూర్కర్‌లను సుప్రీంకోర్టు జడ్జీలుగా కొలీజియం సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 29న వీరి నియామకానికి ఆమోదం తెలిపింది.

రిసెప్షనిస్ట్ హత్య కేసులో బిజెపి నేత కొడుకు సహా ముగ్గురికి జీవిత ఖైదు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని పౌరి జిల్లాలో 2022లో జరిగిన 19 ఏళ్ల రిసెప్షనిస్ట్ హత్య కేసులో బిజెపి మాజీనేత కొడుకుసహా ముగ్గురికి ఉత్తరాఖండ్ న్యాయస్థానం శుక్రవారం జీవిత ఖైదు శిక్ష విధించింది. వ్యభిచారం చేసేందుకు నిరాకరించడంతో.. 2022 సెప్టెంబర్ 18న హత్యకు గురైన రిసెప్షనిస్ట్ అంకితా భండారీ కేసులో ఈ నెల 19న తుది వాదనలు విన్న అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రీనా నేగి రిషీకేశ్ సమీపంలోని వనంతర రిసార్ట్ యజమాని, బిజెపి మాజీ నేత వినోద్ ఆర్య కుమారుడు పులకిత్ ఆర్యకు, ఆ రిసార్ట్‌లో ఉద్యోగులైన మరో ఇద్దరికి జీవిత ఖైదు శిక్ష విధించారు. కేసు విచారణ 2023 జనవరి 30 ప్రారంభమైంది. విచారణ సందర్భంగా న్యాయస్థానం 47 మంది సాక్షులను విచారించి, తుది తీర్పునిచ్చింది.

ది గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : నెం. హెచ్.948, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002. ఫోన్ : 0866-2433379, 2436365

స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు) రూల్స్, 2002లోని రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనతో చదవబడింది. ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి "ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, బ్యాంక్ అధీకృత అధికారి స్వాధీనం...

అమ్మకానికి సంబంధించిన సమాచారం కొరకు బ్యాంక్ www.gandhicub.com నందు లేదా బ్యాంక్ అధీకృత అధికారిని సంప్రదించగలరు.
ది.30-05-2025
సం/- అధీకృత అధికారి

సంపద సృష్టికర్తలు పారిశ్రామిక వేత్తలే!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారని చంద్రబాబు తెలిపారు. అక్కడ ప్రముఖులతో సంబంధాల పెట్టుకుంటే పేదలు ఓట్లు వేయరని చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో ప్రధాని కూడా దావోస్ వెళ్లలేదని పేర్కొన్నారు. ఆ తరువాత తాను 1995 నుంచి దావోస్‌కు తరచూ వెళ్తున్నానని, ఫలితంగా ఉమ్మడి రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వచ్చాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సిఐఐ సదస్సులు నిర్వహించానని, తాను మొదటి నుంచీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించానని అన్నారు. సరైన సమయంలో దేశానికి ప్రధానిగా నరేంద్ర మోడీ ఉన్నారని ప్రశంసించారు. భారత్‌కు మోడీ నాయకత్వం ప్రధాన బలమని పేర్కొన్నారు. చైనా ఆర్థిక వ్యవస్థ భారత్‌కు నాలుగున్నర రెట్లు, అలాగే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఏడు రెట్లు ఎక్కువని వివరించారు. సరైన పాలసీలు రూపొందిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. దేశానికి రానున్న పదేళ్లు అత్యంత కీలకమని అన్నారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ అయితే, అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని బాబు అభివర్ణించారు. ఐటీ పరిశ్రమల వల్లే హైదరాబాద్‌కు లబ్ధి జరిగిందని చెప్పారు. 2047 విజన్ లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని వివరించారు. సాంకేతిక విప్లవంలో చాలా మార్పులు వచ్చా యని అన్నారు. రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటు తన లక్ష్యమని వెల్లడించారు. అమరావతిలో దేశంలోనే తొలిసారి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయబోతున్నామని, విశాఖపట్నానికి టిసిఎస్, గూగుల్, మిట్టల్ పరిశ్రమలు వచ్చాయని పేర్కొన్నారు.

ఏడాదిలోనే రూ.5 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

ఏడాదిలోనే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని బాబు చెప్పారు. పారిశ్రామిక వేత్తలను ఎపికి ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఏపిలో పలు రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని, 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. డెమో గ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగా ఉపయోగించుకోవాలని, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లదే నేడు కీలకపాత్ర అని వివరించారు. అంతకుముందు సిఎం చంద్రబాబును ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ మర్యాద పూర్వకంగా కలిశారు.

జులై 9న చారిత్రక సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

కార్మిక సంఘాలనూ ఏకతాటిపైకి తెచ్చి సార్వత్రిక సమ్మెలను నిర్వహించిన ఘనత సిఐటియుకే దక్కుతుందన్నారు. ఇప్పటివరకు 22 సమ్మెలు జరిగాయని, జులై తొమ్మిదిన చారిత్రక సమ్మె జరగబోతోందని వివరించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని తెలిపారు. కార్మికులకు, కార్మిక సంఘాలకు హక్కుల్లేకుండా చేసేందుకు లేబర్ కోడ్‌లను కేంద్రం తెస్తోందని వివరించారు. వీటిని కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను ప్రయివేటుపరం చేస్తోందని, దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని, దీన్ని ప్రతిఘటించాలని అన్నారు.

సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యాలయ మొదటి అంతస్తును ప్రారంభిస్తున్న బివి.రాఘవులు

బలమైన పోరాటాలు నిర్మించాలి : హేమలత

కార్మికవర్గాన్ని, శ్రమజీవులను సంఘటితం చేసి రాబోయే రోజుల్లో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బలమైన పోరాటాలను నిర్మించాలని కె.హేమ లత పిలుపునిచ్చారు. ఎన్‌వి భాస్కరరావు స్మారక కేంద్రం రాష్ట్రంలో కార్మికోద్యమాలకు కేంద్రంగా ఉండాలని ఆకాంక్షించారు.

యువ కార్మికులను సంఘటితం చేయాలి : బివి.రాఘవులు

యువ కార్మికులను సంఘటితం చేయాల్సిన ఆవశ్యకతను బివి.రాఘవులు నొక్కి చెప్పారు. కార్మికులందర్నీ ఒకే వేదికపై తీసుకొచ్చి ఐక్య పోరాటాలు చేయాలనే స్ఫూర్తిని సిఐటియు కొనసాగిస్తోందన్నారు. దేశంలో కొందరు ఉన్మాదాన్ని, దురంహకారాన్ని రెచ్చగొట్టే పనిలో ఉన్నారని విమర్శించారు. పహల్గాం ఉగ్రవాద ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిందేనన్నారు. అయితే, యుద్ధం దేనికీ పరిష్కారం కాదని తెలిపారు. యుద్ధం వల్ల శాంతికి, ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందన్నారు. ఉన్మాదాలను రెచ్చగొడితే మొట్టమొదట దెబ్బతగిలేది కార్మికవర్గానికేనని తెలిపారు.

ఎం.సాయిబాబు మాట్లాడుతూ సిఐటియుకి జాతీయ, తెలంగాణ సాయుధ పోరాట, సమరశీల పోరాటాల వారసత్వం ఉందన్నారు. ఎస్.వీరయ్య మాట్లాడుతూ దేశంలో మత ఘర్షణలు సృష్టించాలని చూసిన ఉగ్రవాదుల లక్ష్యాన్ని తిప్పికొడుతూ అక్కడ కార్మికవర్గం స్పందించిన తీరు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

నాలుగో స్థానం సరే...

కార్మికుల బతుకుల గురించి మాట్లాడరేమి : ఎంఎ.గఫూర్

మోడీ హయాంలో దేశం వెలిగిపోతోందని, ప్రపంచంలో నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని ఎంఎ.గఫూర్ అన్నారు. కొందరి చేతుల్లో సంపద పోగైతే దేశం గ్రోత్ పెరిగినట్టు కాదని తెలిపారు. సంపదకార్మికులకు చేరినప్పుడే, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన ఆర్థిక వృద్ధి సాధ్యమని తెలిపారు. సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఈ కార్యాలయం నుంచే తాము యూనియన్ నేతలుగా ఎదిగామని, భాస్కరరావు పేరు పెట్టడం సంతోషదాయకమని అన్నారు. ఎపి రాష్ట్ర కమిటీ నుంచి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌వి.భాస్కరరావు కుమార్తె నిర్మల మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో లైబ్రరీ ఏర్పాటుకు తమ కుటుంబం తరఫున సహకారం అందిస్తామన్నారు. బి.వెంకట్, ఆర్.లక్ష్మయ్య, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఎపి సిఐటియు అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు వందన సమర్పణ చేశారు.

కడప ఎస్‌పికి కోర్టు ధిక్కార నోటీసు

అమరావతి : కోర్టు ధిక్కార కేసులో కడప జిల్లా ఎస్‌పి ఇజి అశోక్ కుమారికి హైకోర్టు నోటీసులిచ్చింది. విచారణను జూన్ 16కు వాయిదా వేస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ ఆదేశాలు జారీ చేశారు. 2020లో రాష్ట్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన 1ప్లస్1 భద్రతను ప్రస్తుత ప్రభుత్వం ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ వేముల గ్రామస్తుడు లింగాల రామలింగారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు, పిటిషనర్‌కు 1ప్లస్1 భద్రతను పునరుద్ధరించాలని ఆదేశించింది. దీనిని అమలు చేయని ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేయగా డివిజన్ బెంచ్ నిరాకరించింది. దీంతో ఎస్‌పిపై జస్టిస్ హరినాథ్ విచారణ చేపట్టి ఎస్‌పికి నోటీసులిచ్చారు.

డాక్యుమెంట్ పోయినది

తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, మల్కాజిగిరిలోని ఫంక్షన్ హాల్ దగ్గర, డ్రీమ్ ఎన్‌క్లేవ్, ఫ్లాట్ నెం. 414, వాస్తవ్యులు ఇమంది శేఖర్ శ్రీనివాస్ గారి భార్య ఇమంది హిమబిందుకి చెందిన ఆస్తి డాక్యుమెంట్ నెం.3420/2016 తాడేపల్లి మండలం, కృష్ణానగర్ ఏరియా తాలూక డోర్ నెం.329/2బి ఎ.18.12 సెంట్ల మింజుమలె తాడేపల్లి మున్సిపల్, 14వ బ్లాక్ డోర్ నెం. 14-308కు సమీపమున ప్లాటు నెం. 31 రు దాఖలా చ॥గ॥ 266లు ఖాళీ స్థలం డాక్యుమెంట్ జీరాక్స్ తీసుకునే నిమిత్తం ఇంటి వద్ద నుండి ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఫోన్ నెం. 9032345558కి తెలిజేయగలరు.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) రిజిస్టర్డు ఆఫీసు: టవర్-3, 5వ అంతస్తు, వింగ్ 'బి', కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్ల (వెస్ట్), ముంబయి-400 070. రీజినల్ ఆఫీసు: 4వ అంతస్తు, జానకీ అవెన్యూ, నం.1-11-220/15, బృందావన్ కాలనీ, ప్లాట్ నం.2, బేగంపేట్, హైదరాబాద్-500016.
nido HOME FINANCE

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) రూల్ 8(1)

ఏదైతే, క్రింది సంతకందారు నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 12.11.2024నాటి డిమాండ్ నోటీసు** జారీచేసి, ఇందు రుణగ్రహీత **జగదీష్ లంకె మరియు సహ-రుణగ్రహీత లంకె దిలిప్ కుమార్**లను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా సదరు నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలు **రూ.31,50,000/- (రూపాయలు ముప్పై ఒక లక్షల యాభై వేలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. సదరు రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **సర్క్యులర్ ఎం.పి.నం. 116/2025 ద్వారా గౌరవ చీఫ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్, మచిలీపట్నం వారిచేత నియమించబడిన శ్రీ సిహెచ్. రాజేశ్ కుమార్ అడ్వకేట్ కమిషనర్ ద్వారా 29 మే 2025న భౌతికంగా స్వాధీనంచేసుకున్నారు.**
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కు **రూ.32,71,944.44 పై.లు (రూపాయలు ముప్పై రెండు లక్షల డెబ్బై ఒక వేల తొమ్మిది వందల నలభై నాలుగు మరియు నలభై నాలుగు పైసలు మాత్రమే)**లను దానిపై తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో దానిపై సూచించిన మొత్తాలను, చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

ఆస్తి యొక్క షెడ్యూలు

మచిలీపట్నం, కృష్ణా 521001, మున్సిపల్ కొత్త వార్డు నం.30, పాత అసెస్మెంట్ నం.39912, కొత్త 1070017783తో పూర్తి విస్తీర్ణం 200.75చ.గ.లు లేదా 167.85చ.మీ.లతో డోర్ నం.30/899-1 యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** బొడ్డు వేంకటేశ్వరమ్మ ఆస్తి, **దక్షిణం:** పీట నాగేశ్వర రావు ఆస్తి, **తూర్పు:** మున్సిపల్ బాట & కె. రుక్మేందర్ ఆస్తి, **పడమర:** మున్సిపల్ రోడ్.

ప్రదేశం: మచిలీపట్నం
తేది: 29.05.2025
సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరుపున. (గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేరుగలది)

క్యాన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
Can Fin Homes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS • DEPOSITS Translating Dreams into Reality
బాంచి ఆఫీసు: 4-1-1, గాయత్రి ప్లాజా, 1వ అంతస్తు, కెరిటిపాడు మెయిన్ రోడ్, హరిహర్ మహల్ థియేటర్ ప్రక్కన, గుంటూరు-522007. ఫోన్ నం.: 0863-2333064, మొబైల్: 7625079146,
Email: guntur@canfinhomes.com, CIN: L85110KA1987PLC008699

అమ్మకానికి ఆవశ్యకతగల ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) క్రింద.

టు, రుణగ్రహీతలు: 1) కీ॥శే॥ గొల్లపల్లి మేరి వినయ కుమారి యొక్క చట్టబద్ధ వారసులందరు: నివాసం: ఫ్లాట్ నం.401బి, స్నేహ ఎంక్లేవ్, హెచ్‌బి కాలనీ, నల్లపాడు, గుంటూరు-522004 మరియు **2) శ్రీ గొల్లపల్లి ప్రేమ సుందరం (సహ-రుణగ్రహీత),** ఫ్లాట్ నం.401బి, స్నేహ ఎంక్లేవ్. హెచ్‌బి కాలనీ, నల్లపాడు, గుంటూరు-522004 **మరియు:** ఫ్లాట్ నం.503, ఎస్‌ఆర్ రెసిడెన్సీ, సంతోష్‌నగర్, 3వ లేన్, వేణు గోపాల స్వామి టెంపుల్ దగ్గర, గుంటూరు-522005. నం.1&2 అను మీరు, మీ యొక్క నం.1కు చెందిన దిగువ ఆస్తి తాకట్టుపై మా బ్రాంచి నుండి ఇంటి రుణం పొందియున్నారు. ఖాతా **28.02.2025**న ఎన్‌పిఏగా వర్గీకరించబడినది. **తేది: 03.03.2025 నాటి డిమాండ్ నోటీసు** ఆధారంగా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా తదుపరి మీకు కోరడమైనది.

తాకట్టుపెట్టిన ఆస్తి వివరాలు

గుంటూరు జిల్లా, పత్తిపాడు సబ్-డిస్ట్రిక్ట్, యనమదాల గ్రామపంచాయతి, ప్రత్తిపాడు మండలం ఎక.0.40సెంట్ల విస్తీర్ణంనకుగాను డోర్ నం.587/బి-ఎ, విస్తీర్ణం ఎక.0.21 సెంట్ల యనమదాల గ్రామం యొక్క 592/బి-ఎ, పూర్తి విస్తీర్ణం ఎక.0.61సెంట్లు, విస్తీర్ణం ఎక.0.25సెంట్లను ఇతరులకు విక్రయించిన తరువాత మిగిలిన విస్తీర్ణం ఎక.0.36సెంట్లును యనమదాల పంచాయతి సెక్రటరీ నుండి పి.ఆర్.నం.12/15 నుండి ఆమోదం పొంది ప్లాట్లుగా విభజించిన, ఫ్లాట్ నం.1, విస్తీర్ణం 271.68చ.గ.ల ఖాళీ సైటు యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: **తూర్పు:** 15 అ.ల వెడల్పు రోడ్డు-52.9అ,లు, **దక్షిణం:** బొంతు పున్నయ్య ఆస్తి-44.0అ.లు, **పడమర:** గుంటూరు రామారావు ఆస్తి 52.6అ.లు, **ఉత్తరం:** ఫ్లాట్ నం.2 ఆస్తి-49.5అ.లు, ఈ పై సరిహద్దుల్లో 271.68చ.గ.లు లేదా 227.15చ.మీ.ల విస్తీర్ణపు ఖాళీ సైటు. నిర్ణీత కాలంలోగా డిమాండ్ నోటీసు ప్రకారం చెల్లింపులుచేయుటలో మీరు విఫలం చెందియున్నందున, అధీకృత అధికారియైన క్రింది సంతకందారు, ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) యొక్క నియమాల ప్రకారం, హామీచూపిన స్థిరాస్తిని **16.05.2025న స్వాధీనంచేసుకున్నారు.** మరియు సదరు నోటీసును స్థానిక డైలీ పత్రికలు హన్స్ ఇండియా& ప్రజాశక్తి దినపత్రికల్లో **18.05.2025** ప్రచురించుట జరిగింది.
ఇందుమూలంగా మిమ్ములను కోరునది ఏమనగా, రుణ ఖాతాలో చెల్లించాల్సిన పూర్తి బకాయి మొత్తాలు కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీ& చార్జీలతోసహా **03.03.2025** నాటికి **రూ.1,71,397/-**గా ఉన్నది. ఈ విషయంలో గతంలో తెలిసిన మీ చిరునామాకు రిజిస్టర్డు పోస్టు ద్వారా నోటీసు పంపబడినది కాని అది మీకు బట్వాడా కాకుండానే వెనుదిరిగినది. అందుకు ఈ ప్రచురణ జారీచేస్తున్నారు.
ఈ నోటీసు తేది నుండి 30 రోజుల కాలవ్యవధిలోగా పూర్తి బకాయిలను చెల్లించవలసిందిగా కోరుతూ, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) యొక్క రూల్ 8(6) క్రింద ఇది మీకు చివరి నోటీసు, విఫలం చెందిన ఏదైతే, క్రింది సంతకందారు వేలం తేది నిర్ణయిచి, వేలం ప్రకటన ప్రచురణ ద్వారా మరియు సెక్యూర్డ్ డెట్ యొక్క రియలైజేషన్ కొరకు ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల క్రింద స్థిరాస్తిని విక్రయించెదరు.

తేది: 30.05.2025
ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి
క్యాన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda 117 FOUNDATION YEAR TRUSTED TODAY | TRANSFORMING TOMORROW
బ్యాంక్ ఆఫ్ బరోడా
గుంటూరు బ్రాంచ్, రాజీవ్ గాంధీ భవన్, హిందూ కాలేజ్ దగ్గర, గుంటూరు-522004.
ఫోన్ నెం. 0863-2220244, ఈ-మెయిల్ : guntur@bankofbaroda.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన అనుబంధం-4-ఎ (రూల్స్ 6(2) & 8(6) చూడగలరు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం, 2002 తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2) & 8(6) నిబంధనలు క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) లకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" ''ఏదైతే ఉన్నదో అదే'' మరియు ''ఏది ఎక్కడ ఉంటే అలానే'' ప్రాతిపదికన అమ్మకం జరుపబడును. ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/సెక్యూర్డ్ ఆస్తు(లు)/బకాయి మొత్తము/రిజర్వు ధర/ఇ-వేలం బిడ్ పెంపుదల మొత్తము వివరములు ఈ దిగువ చెప్పబడినది.

ఋణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	బకాయి మొత్తము	ఇ-వేలం తేది & సమయం	రిజర్వు ధర, ధరావత్తు మరియు బిడ్‌పెంపుదల	స్వాధీనం యొక్క స్వభావము నిర్మాణాత్మకం / భౌతికం	ఆస్తి తనిఖీ యొక్క తేది & సమయం
1) M/s. శ్రీ పువ్వాడ ట్రేడ్ లింక్స్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీమతి పువ్వాడ సమత. రిజిస్టర్డ్ చిరునామా: C/o శ్రీ చెన్న కేశవ జిన్నింగ్ మిల్స్, డోర్ నెం: 24/36/30, శ్రీనివాస వే బ్రిడ్జి వెనుక, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా, గుంటూరు - 522003. 2) శ్రీమతి పువ్వాడ సమత, ప్రొప్రయిటర్: M/s శ్రీ పువ్వాడ ట్రేడ్ లింక్స్. రెసిడెన్షియల్ చిరునామా: భర్త: శ్రీ పువ్వాడ సతీష్‌బాబు, ఫ్లాట్ నెం 212, 3వ అంతస్తు, రామమూర్తి అపార్ట్‌మెంట్, 7వ లైన్, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు - 522006. శాశ్వత చిరునామా: శ్రీమతి పువ్వాడ సమత, భర్త: శ్రీ పువ్వాడ సతీష్‌బాబు, డి.నెం. 2-83, పమిడివారిపాలెం, భల్లుకనుడుపాలెం, గుంటూరు - 522112 3) హామీదారు: శ్రీమతి లింగ శిల్ప, భర్త: శ్రీ ఎల్ హనుమంతరావు, ఫ్లాట్ నెం. 303, ఆటం ఫీల్డ్ అపార్ట్‌మెంట్స్, చెలసానినగర్, 3వ లైన్, కానూరు, విజయవాడ - 520007.	షెడ్యూల్ ఏ: కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ ఏరియా, పటమట సబ్-రిజిస్ట్రార్ ఏరియా, కానూరు గ్రామ పంచాయతీ ఏరియా, కానూరు గ్రామం, ఆర్‌యస్ నెం. 248/2ఏ లో 721 చ॥గ॥ విస్తీర్ణంలో యావత్తు ఆస్తి హద్దులు. తూర్పు: యలమంచిలి సత్యనారాయణ యొక్క ఆస్తి - 60-1 అ॥లు. దక్షిణం: 16.5 అ॥ల వెడల్పు పంచాయతీ బజార్ - 107 అ॥లు. పడమర: ఓం శ్రీ టవర్ యొక్క ఆస్తి - 60-1 అ॥లు. ఉత్తరం: 33 అ॥ల వెడల్పు పంచాయతీ బజార్ - 109 అ॥లు. పైన తెలిపిన హద్దుల 721 చ॥గ॥ లేదా 602.82 చ॥మీ॥ స్థలం, దీనిలో అవిభ్యాజపు మరియు అనిర్దేశ్యపు ఆస్తి వాటా 30.76 చ॥గ॥ లేదా 25.71 చ॥మీ॥ స్థలం. షెడ్యూల్ బి: పైన ఐటెమ్ నెం. 1 ఆస్తి నందు విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైడ్ ఫైల్ నెం. 1638/2005 తేదీ. 03.08.2005, ఆమోదించిన ప్లాన్ ప్రకారం "ఆటమ్ ఫీల్డ్" ఆర్‌సిసి నిర్మాణం యొక్క రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 303. శ్రీమతి లింగ శిల్ప గారి పేరున కలదు. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: మెట్లు మరియు వరండా. ఈ హద్దులు రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 303 యొక్క 760 చ॥అ॥ ప్లింత్ ఏరియా, 120 అ॥ల ఉమ్మడి ఏరియా, 80 చ॥అ॥ల పార్కింగ్ ఏరియా మరియు సాధారణ హక్కులతో సహా మరియు యిజిమెంట్ మరియు అనుభవ హక్కులు మొదలగు వాటితో సహా.	తేది 31.05.2021 నాటికి రూ. 19,90,138.66 (అక్షరాల పంతొమ్మిది లక్షల తొంభై వేల నూట ముప్పై ఎనిమిది రూపాయలు మరియు అరవై ఆరు పైసలు మాత్రమే) తేది 01-06-2021 నుండి వర్తించని వడ్డీ మరియు ఇతర ఛార్జీలు, ఏవైనా ఉంటే, వాటితో సహా, రియలైజేషన్ వరకు.	తేది 08.07.2025 మ॥ 02.00 గం.ల నుండి సా॥ 06.00 గం.ల వరకు	రిజర్వు ధర : రూ. 32,58,000/- ధరావత్తు : రూ. 3,25,800/- బిడ్ పెంపుదల : రూ. 20,000/-	నిర్మాణాత్మక స్వాధీనం	తేది. 04.07.2025 ఉ 10.00 గం.ల నుండి సా 05.00 గం. ల వరకు (ముందస్తు అనుమతితో మాత్రమే) మరిన్ని వివరములకు పైన ఇవ్వబడిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్: https://www.bankofbaroda.in/e-auction.htm మరియు ఆన్ లైన్ ఆక్షన్ పోర్టల్ https://Baanknet.com లింక్ను చూడగలరు. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి, టెలిఫోన్ నెం. : 0863-2220244, మొబైల్ నెం.: 89775 13906 నందు సంప్రదించగలరు.
తేది: 28.05.2025, ప్రదేశం: గుంటూరు
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala.
ZONAL OFFICE: 2nd Floor, Halcyon Complex, No.9, St Marks Road, Bangalore-560 001.
e-mail: bgrr-cpc@federalbank.co.in Phone: 080-22074610/604/613/624/625

BGRR/Online Auction/2025-26
PUBLIC NOTICE GOLD AUCTION
30/05/2025

Notice is hereby given to the public in general and the account holders in particular that e-auction of the pledged gold ornaments in the below mentioned account/s will be conducted by Federal Bank Ltd, on 17-06-2025 through online portal, https://gold.samil.in Interested buyers may log on to the auction portal or contact the Bank at contact@federalbank.co.in for further information. In case e-auction is not materialised for any reason on the date mentioned above, with respect any or all items of the pledged ornaments, Bank shall be conducting private sale of the items on any subsequent date/s without further notice.

Br. Gajuwaka: D.NO:10-3-3, Kailash Nagar, 60 Feet Road, Old Gajuwaka, Vishakhapatnam, AP- 530 026 :- 16876800019940,16876800020013.
Br. Vijayawada: Door No.29-7-50,Ground Floor, Ramakrishna Towers, Prakasam Road, Suryaraopet, Vijayawada-520 002:- 11526800030851.
Br. Visakhapatnam: D. No: 12-1-16, Naga Chambers, Waltair Main Road, Vishakhapatnam, AP- 530 002:- 12356800038137,12356800041032.

Bangalore 30-05-2025
Senior Vice President and Zonal Head



సహాయం



బాలు అనే యువకుడికి పెద్దలంటే ఎంతో గౌరవం. ఒకరోజు ఆ యువకుడు రోడ్డుపై వెళ్తున్నప్పుడు ఒక వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ సొమ్మసిల్లి పడిపోయాడు. బాలు వెంటనే ఆ వృద్ధుని దగ్గరికి వెళ్లాడు. అతన్ని దగ్గర్లోని వైద్యశాలకు తీసుకువెళ్లాడు. వైద్యం చేయించి మందులు తీసుకుని ఆ వృద్ధుని ఇంటిదగ్గర దింపడానికి వెళ్లాడు. అయితే అక్కడ ఎవరూ లేరు. వృద్ధుడు ఒంటరిగా ఉంటున్నాడని బాలుకి అర్థమైంది. తిరిగి ఆ వృద్ధుడిని తీసుకుని తన ఇంటికి తీసుకెళ్లాడు. అమ్మకి విషయం అంతా చెప్పి, తన ఇంట్లోనే ఉంచి వృద్ధుడు కోలుకునే దాకా సేవలు చేశాడు. బాలు చేసిన పనికి గ్రామంలో వాళ్లందరూ మెచ్చుకున్నారు.

- విలోహిత్,
7 వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్,
రేగులపల్లి.

పక్షి భయం

ఒక ఊరిలో పెద్ద చెట్టు ఉంది. దాని మీద ఒక పక్షి గూడు కట్టుకుని నివాసం ఉంది. ఆ పక్షికి నలుగురు పిల్లలు. తల్లి పక్షి తన నలుగురు పిల్ల పక్షులకు ఎలా ఎగరాలో నేర్పించింది. అయితే మూడు పిల్లలు తల్లి పక్షి చెప్పిన విధంగా ప్రయత్నం చేసి ఎగరడం నేర్చుకున్నాయి. ఒక పక్షి పిల్ల మాత్రం ఎగరడం నేర్చుకోలేదు. ఎన్నిసార్లు వాళ్ల అమ్మ అడిగినా నేర్చుకోకపోవడానికి కారణం చెప్పలేదు. ఇలా చాలా రోజులు గడిచిపోయాయి. ఎగరని పక్షి పిల్ల గురించి తల్లి పక్షికి దిగులు పట్టింది. అది ఎగరక పోవడానికి కారణం తెలుసుకోవాలనుకుంది. ఒక రోజు దాన్ని పిలిచి 'ఎందుకు నువ్వు ఎగరాలనుకోవడం లేదు' అని గట్టిగా అడిగింది. అప్పుడు పిల్ల పక్షి ఇలా చెప్పింది. 'నేను పైకి ఎగిరితే కిందపడి చచ్చిపోతానేమో అని భయం. అందుకే ఎగరడం నేర్చుకోవడం లేదు' అంది.

అప్పుడు తల్లి పక్షి 'ఓసి పిచ్చి మొహమా! ఇదా నీ భయం. ఎగరడం అనేది మన జాతి తప్ప ఏ జీవి చేయలేదు. అది మన సహజ లక్షణం. ఎగిరితేనే మనం బతకగలం. ఎగరడం మన జీవనాధారం. భయం వదిలి నా మాట విని ఎగురు' అని ధైర్యం చెప్పింది.

అమ్మ చెప్పిన మాటలతో నాలుగో పిల్ల పక్షి తనలోని భయాన్ని విడిచిపెట్టింది. చిన్నగా

ఎగరడం నేర్చుకుంది. కొన్ని రోజులకే మిగిలిన పక్షుల్లాగే ఎగరడం ప్రారంభించింది.

- జి.నిషితారెడ్డి,
7వ తరగతి,
గీతాంజలి హైస్కూలు,
రెడ్డిగూడెం,
ఎన్‌టిఆర్ జిల్లా.

అభినందన : ఈ కథను రాసిన నిషితానే బొమ్మ కూడా వేసింది. చిన్నారి నిషితకి అభినందనలు.

బొమ్మల కొలువు



ఎం.డి.జ్యోతిర్మయి,
10వ తరగతి,
టిసిజిహెచ్ స్కూలు,
పమిడి.

పి.పూర్ణ వెంకట శ్రీసాయి,
8వ తరగతి,
బాబానగర్,
నెల్లూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

JEEVANA జీవన the family

పాఠశాల విద్య కూడా అభ్యసించని ఆ అమ్మమ్మ ప్రపంచ విషయాలపై చర్చించేంత అనుభవం సంపాదించింది. పెద్దయ్యాకే అక్షరాలు నేర్చుకొని, ప్రజల సమస్యపై ఏకంగా ప్రధానమంత్రికి ఉత్తరం రాసింది. అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా)లో పనిచేస్తూ, అనేక ప్రజాసమస్యలపై పోరాడింది. తన ముగ్గురు ఆడపిల్లలను సైతం ఉద్యమానికి పరిచయం చేసిన ఆమె 79వ ఏట క్యాన్సర్‌తో కన్ను మూసేవరకూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉంది. ఆ అమ్మమ్మ పేరు తాయారమ్మ. ఆ అమ్మమ్మకు మనవరాలు శ్వేత అర్పించిన అక్షర నివాళి ఇది.

ప్రధానికి ఉత్తరం రాసిన ఓ అమ్మమ్మ కథ

కృష్ణా జిల్లాలోని బందరు దగ్గర వున్న పోతిరెడ్డిపాలెంలో పుట్టింది మా అమ్మమ్మ (తాయారమ్మ). నలుగురు చెల్లెళ్ళు, అయిదుగురు అన్నదమ్ముల మధ్య పెరిగింది అమ్మమ్మ. అందరిలో రెండవ సంతానం. పోతిరెడ్డిపాలెంలో మొక్కలు బాగా పెంచేది. ఇంట్లో అందరి కన్నా పెద్దమ్మాయి కావడంతో, చిన్నప్పటి నుంచే వంట బాధ్యత ఆమె మీద పడింది. రోజూ ఉదయాన్నే గ్లాస్ నిండా కాఫీ పోసుకొని తాగి వంట పనుల్లోకి దిగేది. ఆడపిల్లలు చదువుకోకూడదు అనుకునే కుటుంబంలో పుట్టినప్పటికీ చదువుకోవాలని తపించింది. ఉదయాన్నే లేచి ఇంటి పనులు చేసి స్కూలికి వెళ్ళేదట. అప్పుడు, వాళ్ళ అమ్మ స్కూల్‌కి వచ్చి, అమ్మమ్మని ఇంటికి తిరిగి తీసుకొచ్చేసేది. స్కూలికి వెళ్లాలని అమ్మమ్మ ఎన్ని ప్రయత్నాలు చేసిందో... వెళ్ళనివ్వకుండా వాళ్ళ అమ్మ అన్ని ప్రయత్నాలూ చేసేది. అలా పాఠశాల విద్య లేకుండానే ఆమె బాల్యం పూర్తయ్యింది.

అమ్మమ్మ వాళ్ళ నాన్న పోతిరెడ్డిపాలెంలో బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసేవారు. కూతురికి మంచి వ్యక్తికిచ్చి పెళ్లి చేయాలని అనుకున్నారు. తాతయ్య గురించి ఎవరో చెప్పారు. అది తెలుసుకొని అమ్మమ్మకు, తాతయ్య (కంచి ముత్యాలు)కు పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు తాతయ్యకు పోస్టల్ యూనియన్ మీద ఉన్నంత ఆసక్తి పెళ్లి మీద లేదు. అయినప్పటికీ ఒప్పించారు. అమ్మమ్మకి సుమారు 16 ఏండ్లు ఉన్నప్పుడు – అంటే 1963లో తాతయ్యతో పెళ్లి చేశారు. పల్లెటూరి పిల్లగా పెరిగిన అమ్మమ్మకు తాతయ్య వల్లే సమాజం, వామపక్ష భావజాలం, వర్గదృక్పథం పరిచయమయ్యాయి. ఇల్లు, వంటిల్లు నుంచి బయటకు వచ్చి ఉద్యమాల్లో పాల్గొంది.

పెళ్లి అయిన మూడేండ్లకు మా పెద్దమ్మ నాగలక్ష్మి పుట్టింది. ఆమె ఆరు నెలల పాపగా ఉన్నప్పుడు అమ్మమ్మను మోపర్రులో వదిలి యూనియన్ పనుల కోసం హైదరాబాద్ వెళ్లారు తాతయ్య. యూనియన్ పనుల్లో మునిగి ఒక్క ఉత్తరం కూడా రాయలేదు. పెద్దమ్మను తీసుకొని అమ్మమ్మ పుట్టింటికి వెళ్ళింది. అక్కడ చుట్టుపక్కల వారు అనే మాటలను భరిస్తూ ఏడాది గడిపింది. అప్పట్లో ఫోన్లు లేకపోవడంతో రోజూ ఉదయాన్నే లేచి తాతయ్య ఉత్తరం కోసం ఎదురుచూసే దాన్నని అమ్మమ్మ నాతో చెప్పింది. ఇక అమ్మమ్మ వాళ్ళ అమ్మ ఆమెను పక్క ఊరులోని జ్యోతిష్కుడి దగ్గరికి తీసుకెళ్లింది. 'మీ ఆయన ఇక తిరిగిరాడు, హైదరాబాదులో ఇంకో కాపురం పెట్టాడు' అని ఆ జ్యోతిష్కుడు చెప్పాడట. పూజలు చేస్తే తాతయ్య తిరిగి వస్తాడని పూజలు కూడా చేసిందట. ఒక రోజు తాతయ్య వచ్చి, యూనియన్ పనుల్లో బిజీగా ఉండి లెటర్ రాయలేకపోయానని సంజాయిషీ

ఇచ్చాడు. అలా అప్పట్లో తెలియక జ్యోతిష్యాలు నమ్మి, పూజలు చేశానని తనను తాను విమర్శించుకుంటూ ఉండేది అమ్మమ్మ. తాతయ్యకు హైదరాబాద్ నుంచి తిరువూరు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. అక్కడే మా అమ్మ లలిత పుట్టింది. అలా ట్రాన్స్‌ఫర్ అవుతూ మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ తిరిగారు. 1973లో కొడుకు వాసు పుట్టాడు. ఆ తర్వాత బందరులో స్థిరపడ్డారు. 1980లో గోడ కూలి కొడుకు చనిపోయాడు. ఆ బాధ నుంచి అమ్మమ్మ కోలుకోలేకపోయింది. ఆఖరి దశలోనూ గుర్తు చేసుకుని బాధపడేది. ఆ బాధ నుంచి బయటపడడానికి తాతయ్య అమ్మమ్మను డాక్టర్ హేమలత గారికి పరిచయం చేశారు. హేమలత గారు బందరులో అప్పటికే ప్రజా వైద్యశాల నడుపుతూనే, మహిళల, ప్రజా సమస్యలపై పనిచేసేవారు. అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వచ్చి ఎన్నో విషయాలు చెప్పి ఆమెలో స్ఫూర్తి నింపారు. శ్యామ్ బాబు గారు, మధుసూదనరావు గారు, తాతయ్య వాళ్ళు... ఈ మూడు కుటుంబాలు కలిసి ఒకే కాంప్లెక్స్‌లో ఉండేవారట. అప్పట్లో బందరులో సీపీఐ(ఎం) నిర్మాణానికి ఈ ముగ్గురూ చాలా కష్టపడ్డారు. హేమలత గారి ప్రోత్సాహంతో అమ్మమ్మ ఐద్వా కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించింది. మచిలీపట్నంలో మంచి నీటి సమస్య పరిష్కారానికి బిందెలు పట్టుకొని ర్యాలీలు తీశారు. స్థానిక సమస్యలపై పోరాటాలు చేశారు. ఐద్వా సభ్యత్వం కోసం చుట్టుపక్కల ఊర్లన్నీ తిరిగేది అమ్మమ్మ. అలా పార్టీ, ఐద్వా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తుదివరకూ పార్టీ పట్ల, ఐద్వా పట్ల అంకితభావంతో పని చేసింది అమ్మమ్మ.

బందరులో తుపాను వచ్చినప్పుడు గవర్నమెంట్ స్కూల్లో శరణార్థులకు భోజనం తయారు చేసే టీమ్‌లో అమ్మమ్మ కీలక పాత్ర పోషించింది. అప్పుడే శ్యామ్‌బాబు గారు అమ్మమ్మకి అన్నపూర్ణమ్మ అని పేరు పెట్టారు. పోస్టల్ యూనియన్ పనుల కోసం ఇంటికి వచ్చిన కామ్రేడ్స్ అందరికీ భోజనాలు పెట్టేది. పండుగలు వచ్చినప్పుడు మోపిదేవిలో తాతయ్య పోస్టాఫీసు సిబ్బందిని ఇంటికి పిలిచి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసేవారు. స్కూలుకి వెళ్ళని అమ్మమ్మను మా పెద్దమ్మ ప్రోత్సహించి చదువు నేర్పింది. చదువు మీద ఆసక్తితో అమ్మమ్మ కూడా తెలుగు చదవడం, రాయడం నేర్చుకుంది. చివరివరకూ ప్రజాశక్తి/ నవ తెలంగాణ పత్రిక రోజూ చదివి, మాతో డిస్కస్ చేసేది.

ఒక రోజు బందరులో మార్కెట్‌కు వెళ్లొచ్చి తాతయ్యతో 'ఏంటి సరుకుల రేట్లు ఇలా పెరిగిపోతున్నాయి' అంటే... దానికి ఆయన 'ప్రైమ్ మినిస్టర్‌ని అడుగు' అన్నారట. అప్పుడు అమ్మమ్మ అప్పటి ప్రధాని వీపీ సింగ్‌కు ఉత్తరం రాసింది. ఉత్తరాన్ని తాతయ్యే స్వయంగా పోస్ట్ చేశారట. ఈ విషయాన్ని పరిశీలిస్తామని పీఎంఓ నుంచి జవాబు కూడా వచ్చిందని గర్వంగా చెప్పింది. ఇప్పటి ప్రభుత్వం అయితే అలా ఉత్తరం రాస్తే మనల్ని దేశద్రోహులంటారని నవ్వుతూ అనేది.

1992లో తాతయ్య రిటైరయ్యారు. సుదీర్ఘకాలం ఉద్యమాల్లో పనిచేసిన తాతయ్య అనుభవం రాష్ట్ర ఉద్యమానికి అవసరమని, అప్పటి సీఐటీయూ నాయకులు నండూరి ప్రసాదరావు గారు, పర్సా సత్యనారాయణ గారు తాతయ్యను హైదరాబాదుకు రమ్మని కోరారట. దానితో కుటుంబమంతా హైదరాబాదుకు మకాం మార్చింది. హైదరాబాద్‌లో కూడా అమ్మమ్మ ఐద్వా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది. యూనిట్ మీటింగ్‌లకు కచ్చితంగా సమయానికి అటెండ్ అయ్యేది. కూతుర్లను సామాజిక దృక్పథంతో పెంచారు గ్రాడ్యుయేట్లను చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రోత్సహించారు. పార్టీలో యాక్టివ్‌గా పనిచేసే వారికిచ్చి పెళ్లి చేశారు.

2024 ఏప్రిల్‌లో అమ్మమ్మకు బ్లడ్ క్యాన్సరని తెలిసింది. అలా ఓ ఏడాది పాటు క్యాన్సర్‌తో పోరాడింది. ఆమె గుండె ధైర్యాన్ని చూసి డాక్టర్లు కూడా ఆశ్చర్యపోయారు. 2025 మే 20న ఆ గుండె చివరిసారి కొట్టుకుంది. సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ హేమలత గారు చాలా బిజీ షెడ్యూల్‌లోనూ ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు కేవలం అమ్మమ్మ కోసమే వచ్చి చివరి దశలో ఆమెతో ఆప్యాయంగా మాట్లాడారు. అమ్మమ్మకు ఉద్యమ జీవితాన్ని పరిచయం చేసిన హేమలత గారే ఆమెతో చివరిసారి మాట్లాడటం మాకు స్ఫూర్తినిచ్చింది.

అమ్మమ్మ నిరంతరం తన జ్ఞానాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించేది. జ్యోతిష్యాలను నమ్మే స్థాయి నుంచి చనిపోయిన తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడాలని తన భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి డొనేట్ చేసే స్థాయికి ఎదిగింది. కూతుర్లకు ఆదర్శ వివాహాలు చేసింది. స్మార్ట్ ఫోన్ వాడే అంత స్మార్ట్ అయ్యింది. పుస్తకాలు చదివి మాతో చర్చలు జరిపేది. మాలో స్ఫూర్తి నింపేందుకు గొప్ప గొప్ప వ్యక్తుల గురించి చెబుతుండేది. గొప్ప పనులు చేసిన నేతలెందరో ఉన్నారు. కానీ తన పరిధిలో తనకు చేతనైనంతే కాక, తన పరిధికంటే ఎక్కువే చేసిన మా అమ్మమ్మ నా దృష్టిలో ఎప్పుడూ హీరోనే!

- శ్వేత, ఎంటెక్
83330 40365

రెండు రాష్ట్రాలూ ఒకే ఏడాది అవార్డులు ఇవ్వొద్దు

తెలంగాణ ప్రభుత్వం పదకొండేళ్ల తర్వాత గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు, జ్యూరీ చైర్మన్ మురళీ మోహన్ ఆధ్వర్యంలో విజేతలను నిర్ణయించారు. 2024లో వచ్చిన సినిమాల్లోని అన్ని కేటగిరీలకు అవార్డులను ప్రకటించగా.. తాజాగా 2014 నుండి 2023 వరకు వచ్చిన సినిమాలకు బెస్ట్ ఫిలిం అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ.. ఒకే సినిమాకు ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలు అవార్డులు ఇవ్వడం మంచిది కాదు అన్నారు. 'రెండు రాష్ట్రాలు ఒకే ఏడాది అవార్డులు ఇవ్వొద్దు. ఎందుకంటే ఒక రాష్ట్రం ఒక సినిమాకు అవార్డు ఇస్తే మరో రాష్ట్రం అదే కేటగిరీలో ఇంకో సినిమాకు అవార్డు ఇస్తే భిన్నాభిప్రాయాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే ఒక ఏడాది ఒక రాష్ట్రం ఇస్తే ఇంకో ఏడాది ఇంకో రాష్ట్ర అవార్డు ఇవ్వాలి. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలు ముఖ్యమే. ఎవరూ ఎక్కువ కాదు.. ఎవరూ తక్కువ కాదు. కాబట్టి రెండు రాష్ట్రాలు ఈ విషయంలో అవగాహనకు రావాలి' అని మురళీ మోహన్ అన్నారు.



2014 నుండి 2023 వరకు వచ్చిన సినిమాలకు బెస్ట్ ఫిలిం అవార్డులు ప్రకటిస్తున్న ఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు, జ్యూరీ చైర్మన్ మురళీ మోహన్ తదితరులు

ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో నటి



కన్నడ, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమలో నటిస్తున్న అర్చనా సింగ్ ఇటీవల హిమాలయాల్లోని 'ఎవరెస్ట్ బేస్ క్యాంప్' సాహస యాత్ర చేశారు. ఎం.బి.ఏ పూర్తి చేసిన అర్చన, సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే, 'విప్రో', 'ఐ.టి.సి. గ్రూప్ ఆఫ్ హెూటల్స్', 'కింగ్ ఫిషర్', 'జెట్ ఎయిర్‌లైన్స్' వంటి సంస్థల్లో ఎయిర్ హెూస్టెస్‌గా పనిచేశారు.

జార్జియాలో 'అఖండ 2'

బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబి నేషన్లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2'. ఈ సిని మా కీలక షెడ్యూల్ కోసం చిత్ర బృందం జార్జియా చేరుకుంది. అక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో విదేశీ ఫైటర్స్ కూడా పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ షెడ్యూల్‌లోనే బాలయ్య రెండో పాత్ర కు సంబంధించిన ట్విస్ట్ కూడా రివీల్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



అమెరికా కాల్పుల విరమణ ప్రతిపాదనకు హమాస్ తిరస్కరణ

గాజా/పారిస్ : గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదల కోసం అమెరికా ప్రతిపాదనలను హమాస్ తిరస్కరించిందని ఆ సంస్థ నాయకుడు తెలిపారు. అంతకుముందు అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో జరిపిన చర్చల్లోని అంశాలకు.. ఈ ప్రతిపాదనలు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు.

ఇక అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ ఇటీవల ఓ కాల్పుల విరమణ ప్రతిపాదనను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం హమాస్ సజీవంగా ఉన్న 10మంది బందీలను అప్పగించడంతోపాటు.. 18 మంది మృతదేహాలను కూడా ఇవ్వాలి. రెండు దశల్లో ఇది జరగాలి. దీనికి ప్రతిగా ఇజ్రాయిల్ 60 రోజులు కాల్పుల విరమణను పాటించడంతోపాటు.. తమ బందీలుగా ఉన్న పాలస్తీనా ఖైదీలను అప్పగించాల్సి ఉంటుంది. వాస్తవానికి హమాస్ వద్ద 58 మంది బందీలు ఉన్నారు. వారిలో కనీసం 20 మంది సజీవంగా ఉన్నట్లు ఇజ్రాయిల్ బలంగా నమ్ముతోంది. దీనిపై ఇజ్రాయిల్ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. ప్రధాని నెతన్యాహూ మాత్రం బాధిత కుటుంబాలతో మాట్లాడుతూ తాను ఆ ఒప్పందానికి అంగీకరిస్తానని చెప్పారు. ప్రస్తుతం గాజాను పూర్తిగా మూసేసిన ఇజ్రాయిల్ మార్చి 18 నుంచి ఎదురుదాడులు

కొనసాగిస్తోంది. దీంతో అప్పటివరకు అమెరికా, ఖతార్, ఈజిప్ట్ సంయుక్తంగా కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందం నీరుగారిపోయింది. ఈ నెల 19 నుంచి మరింత విస్తృతంగా ఇజ్రాయిల్ దళాలు ఆపరేషన్ చేపట్టాయి. అవి గాజాను పూర్తిగా అధీనంలోకి తీసుకొంటాయని నాడు నెతన్యాహూ వెల్లడించారు. గత 10 వారాల్లో దాదాపు 4,000 మంది ప్రజలు గాజాలో మరణించినట్టు హమాస్ ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి.

గాజాకు మానవతా సాయం అడ్డుకోవడంపై ఫ్రాన్స్ ఆగ్రహం

గాజాకు మానవతా సాయం అందకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడంపై ఫ్రాన్స్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి మానవతా సాయాన్ని అడ్డుకుంటే ఇజ్రాయిల్‌పై కఠిన వైఖరి అవలంబిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హెచ్చరించారు. రెండు దేశాల సిద్ధాంతానికి ఫ్రాన్స్ కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. 'మానవతా సాయానికి సృష్టిస్తున్న అడ్డంకులు భరించలేని పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పుడు స్పందించకపోతే పరిస్థితి గంటలు, రోజుల్లోనే దిగజారిపోతుంది. అందుకే మేం కఠిన వైఖరి అవలంబిస్తాం. ఇజ్రాయిల్‌పై ఆంక్షల అంశాన్ని కూడా ఫ్రాన్స్ పరిశీలిస్తుంది. మేం మానవాతా సాయం అందించడానికి వీలుగా ఇజ్రాయిల్ తన వైఖరి మార్చుకొంటుందని ఆశిస్తున్నాను. పాలస్తీనా–ఇజ్రాయిల్ సమస్యకు రాజకీయ పరిష్కారం అవసరమని నమ్ముతున్నాం. పాలస్తీనా ఉండాల్సిన అవసరం చాలా ఉంది' అని మాక్రాన్ ఒక మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఆ సమయంలో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ కూడా పక్కనే ఉన్నారు. ప్రపంచ దేశాల ఒత్తిడికి తలొగ్గిన ఇజ్రాయిల్ ఇటీవలే మానవతా సాయానికి అనుమతించింది. అయినప్పటికీ కాల్పులు జరుపుతూ, దాడులు చేస్తూ... సహాయం కోసం వచ్చిన వారిని సైతం హత్య చేస్తోంది.

ముంబయి ముందుకు..

ఫైనల్ బెర్త్‌కు 1న రోహిత్ సేన పంజాబ్‌తో ఢీ
ఎమిలినేటర్‌లో పోరాడి ఓడిన గుజరాత్

ఛండీగఢ్: ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి జట్టు సమిష్టిగా రాణించింది. తొలుత బ్యాటింగ్‌లో, ఆ తర్వాత బౌలింగ్‌లో రాణించిన ఐదుసార్లు ఛాంపియన్ ముంబయి.. గుజరాత్‌పై 20పరుగుల తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ కోసం పంజాబ్‌తో పోరుకు సిద్ధమైంది. ముంబయి నిర్దేశించిన 229 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో గుజరాత్ జట్టు చివరివరకు పోరాడి ఓటమిపాలైంది. చివరి ఓవర్లో విజయానికి 24పరుగులు చేయాల్సిన దశలో గుజరాత్.. తొలి రెండు బంతులకు ఒక్క పరుగే చేయడం.. ఆ తర్వాత బంతికి షారుక్ ఖాన్ ఔటవ్వడంతో ఫలితం ముంబయివైపు మొగ్గింది. దీంతో నిర్ణీత 20 ఓవర్లు ముగిసే సరికి గుజరాత్ జట్టు 6వికెట్ల నష్టానికి 208 పరుగులే చేయగల్గింది. సాయి సుదర్శన్(80), సుందర్(48), రూథర్ఫర్డ్(24) బ్యాటింగ్‌లో రాణించగా.. ముంబయి బౌలర్లు బౌల్ట్‌కు రెండు, బుమ్రా, గ్లీసన్, సాంట్నర్, అశ్వినీ కుమార్‌లకు ఒక్కో వికెట్ చొప్పున పడగొట్టారు. ఈ ఓటమితో గుజరాత్ జట్టు ఐపిఎల్ సీజన్–18 4వ స్థానానికే పరిమితమైంది.

అంతకుముందు ముంబయి టాపార్డర్ బ్యాటర్లు రోహిత్ శర్మ(81) అర్ధసెంచరీకి తోడు బెయిర్‌స్టో(47) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా కూడా బ్యాట్ ఝుళిపించడంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ గెలిచిన ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్యా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ముంబయి ఓపెనర్లు చెలరేగారు. గుజరాత్ ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడం కూడా ముంబయికు కలిసొచ్చింది. రోహిత్ శర్మ (81), జానీ బెయిర్‌స్టో (47) తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. 7.2వ ఓవర్‌లో 84 పరుగుల వద్ద ముంబయి ఇండియన్స్ తొలి వికెట్ కోల్పోయింది. సాయి కిషోర్ బౌలింగ్‌లో కొయెట్జీ క్యాచ్ పట్టడంతో జానీ బెయిర్‌స్టో (47) ఔటయ్యాడు. ముంబయి ఇండియన్స్ ఓపెనర్ రోహిత్ శర్మకు రెండు లైఫ్‌లు లభించాయి. గెరాల్డ్ కొయెట్జీ, కుసాల్ మెండిస్ సునాయాసమైన క్యాచ్‌లు వదిలేశారు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. బెయిర్ స్టో ఔటైన తర్వాత వచ్చిన సూర్యకుమార్ (33) చూడచక్కని షాట్లతో అలరించాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (25) కూడా మూడు సిక్స్‌లు కొట్టాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (22) కూడా వేగంగా పరుగులు చేశారు. దీంతో ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీశారు. సిరాజ్‌కు ఒక వికెట్ దక్కాయి.

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రోహిత్ శర్మ (81పరుగులు; 50బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్లు)

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా...)

ముంబయి : 228/5 (20ఓవర్లలో)
(రోహిత్ 81, బెయిర్‌స్టో 47, తిలక్ 25; ప్రసిధ్ (2/53), సాయి కిషోర్ 2/42)
గుజరాత్ : 208/6 (20ఓవర్లలో)
(సాయి సుదర్శన్ 80, సుందర్ 48; బౌల్ట్ (2/56), బుమ్రా 1/27)
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ : రోహిత్ శర్మ

నందిని, గుల్వీర్‌కు స్వర్ణాలు

ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్

గుమీ (దక్షిణకొరియా): ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్స్‌లో భారత అథ్లెట్లకు మరో రెండు స్వర్ణ పతకాలు దక్కాయి. హెప్టాథ్లాన్‌లో నందిని అగసరా, 5వేల మీ. పరుగులో గుల్వీర్ సింగ్ బంగారు పతకాల్ని సాధించారు. అలాగే మహిళల హైజంప్‌లో పూజ, 3వేల మీ. స్టీపుల్ ఛేజ్‌లో పారుల్ చౌదరి రజత పతకాల్ని అందించారు. శుక్రవారం జరిగిన 800మీ. రేస్‌లో అగసరా చైనా అథ్లెట్‌కంటే 54పాయింట్లు అధిక్యతతో తొలిస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. 800మీ. రేస్‌ను నందిన 2నిమిషాల 15:54సెకన్లలో పూర్తిచేసి 885పాయింట్లు సాధించింది. ఇక చైనాకు చెందిన జింగి 2నిమిషాల 24:87 సెకన్లలో పూర్తిచేసి 759పాయింట్లతో రెండోస్థానానికే పరిమితమైంది. హెప్టథ్లాన్ విభాగంలో భారత్‌కు బంగారు పతకం దక్కడం ఇది మూడోసారి. అంతకుముందు స్వప్న బర్మన్(2017), సోమ బిస్వాస్(2005)లో హెప్టథ్లాన్ విభాగాల్లో భారత్‌కు బంగారు పతకాలను అందించారు. ఇక పురుషుల 5వేల మీ. పరుగులో గుల్వీర్ సింగ్ మరో స్వర్ణ పతకాన్ని భారత్‌కు అందించాడు. 5వేల మీ. పరుగును గుల్వీర్ 13నిమిషాల 24:77సెకన్లలో పూర్తిచేసి ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో థాయ్‌లాండ్‌కు చెందిన కీరన్(13నిమిషాల 24:97సెకన్లు), జపాన్‌కు చెందిన నగ్లే మోరీ(13నిమిషాల 25:06సెకన్లు) రజత, కాంస్య పతకాలను సాధించారు. 10వేల మీ. పరుగులో గుల్వీర్ తొలి స్వర్ణ పతకం సాధించిన సంగతి తెలిసిందే.

ప్రి క్వార్టర్స్‌కు సబలెంక, కసట్కినా

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, ఆస్ట్రేలియాకు చెందిన 17వ సీడ్ కసట్కినా ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో సబలెంక 6–2, 6–3తో పోర్చుగల్‌కు చెందిన డైనాలోవిక్‌ను, కసట్కినా 6–4, 6–2తో ఫ్రాన్స్‌కు చెందిన జీన్‌జాన్‌ను చిత్తుచేశారు. మరో పోటీలో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి ఇగా స్వైటెక్ 6–2, 7–5తో క్రిస్టియన్(జర్మనీ)పై, 16వ సీడ్ అనిషిమోవా(అమెరికా) 7–6(7–4), 6–4తో డెన్మార్క్‌కు చెందిన టాసన్‌ను చిత్తుచేశారు. మరో పోటీలో 8వ సీడ్, చైనాకు చెందిన జెంగ్ 6–3, 6–4తో మోకో(కెనడా)ను ఓడించగా.. 19వ సీడ్, రష్యాకు చెందిన సంసనోవా 6–2, 6–3తో ఉక్రెయిన్‌కు చెందిన యస్ట్రిమెక్సీను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరింది.

ఐదుసెట్ల హోరాహోరీ పోరులో 10వ సీడ్ రూనే(డెన్మార్క్), 12వ సీడ్ టామీ పాల్(అమెరికా) ప్రత్యర్థులను చిత్తుచేసి ప్రి క్వార్టర్స్‌కు చేరారు. పాల్ 6–3, 3–6, 7–6(9–7), 3–6, 6–3తో 24వ సీడ్, రష్యాకు చెందిన ఖచనోవ్‌పై, రూనే 4–6, 6–2, 5–7, 7–5, 6–2తో ఫ్రాన్స్‌కు చెందిన హయాస్‌ను చిత్తుచేశాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68